సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 17.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 117
పేజీలు: 12 వెల: రూ. 5


కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ తో ఎంపీ బండి సంజయ్

- కరీంనగర్ కార్పొరేషన్ తోనే సరిపెట్టుకున్న బీజేపీ
- 17 మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్
- పలు చోట్ల కాంగ్రెస్‌కి మద్దతుగా ఎక్స్ అఫిషియో ఓట్లేసిన బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు
- నర్సాపూర్, మెట్‌పల్లి,ఆమనగల్, మొయినాబాద్, అలియాబాద్ లో ఒకటైన బీజేపీ, కాంగ్రెస్
- అభ్యర్థుల ఆందోళనలు, నిరసనలతో 11 చోట్ల చైర్మన్ ఎన్నిక రద్దు
- నేడు ఎన్నిక నిర్వహించే అవకాశం
- ఆసిఫాబాద్ 'హస్తం'లో చైర్మన్ పదవి చిచ్చు
- కొత్తగూడెం మేయర్ పీఠం దక్కించుకున్న సీపీఐ
- భైంసా చైర్ పర్సన్ గా ఇండిపెండెంట్

# హస్తగతం

## 5 కార్పొరేషన్లు.., 86 పుర పీఠాల్లో కాంగ్రెస్ పాగా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నరాలు తెగే ఉత్కంఠ రేపిన 'పుర' రాజకీయాలకు ఎట్టకేలకు తెరపడింది. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అంతిమంగా ఏ ఏ కార్పొరేషన్లు.. మున్సిపాలిటీల్లో తమ జెండా ఎగురవేశారో తేలిపోయింది. ఆయా పీఠాలు దక్కించుకునేందుకు పార్టీల మధ్య ఒకరిని మించి మరొకరు రచించిన ప్రణాళికలు రాష్ట్ర రాజకీయాలను మరింత రసవత్తరంగా మార్చాయి. పుర పీఠాలు కైవసం చేసుకునేందుకు ఊహించని సంచలనాలు, సమీకరణాలతో ఆయా పార్టీల మధ్య కుదిరిన పొత్తులు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీశాయి. ఇంత కాలం ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్న పార్టీలే ఇప్పుడు అధికారం కోసం ఒక్కటై అందరి నోళ్లపై వేలు వేసుకునేలా చేశాయి. తమ మధ్య ఉన్న వైరం నమ్మించేందుకు పోటీ పడీ మరి తిట్టుకున్న పార్టీలే సోమవారం జరిగిన ఎన్నికలో చెట్టాపట్టా లేసుకుని మేయర్, చైర్మన్ పీఠాలెక్కేశాయి. దీంతో ఇంతకాలం పార్టీల మధ్య సాగిన తిట్ల దండకాలు చర్చనీయాంశంగా మారగా.. ఇప్పు డు కుదిరిన స్నేహాలు ఎంత కాలం నిలుస్తాయోననే చర్చ హాట్ టాపిక్ గా మారింది.

### పీఠం దక్కించుకున్న పార్టీలు

| కార్పొరేషన్ | మేయర్ | డిప్యూటీ మేయర్ |
|---|---|---|
| కరీంనగర్ | కొలగాని శ్రీనివాస్ (బీజేపీ) | సునీల్ రావు (బీజేపీ) |
| మంచిర్యాల | ధరణి మధుకర్ (కాంగ్రెస్) | సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) |
| నల్గొండ | బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్) | ఎండి అష్రఫ్ అలీ ఆమేర్ (కాంగ్రెస్) |
| మహబూబ్ నగర్ | జీ మమత (కాంగ్రెస్) | ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) |
| కొత్తగూడెం | మూడ్ గణేశ్ (సీపీఐ) | సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) |
| రామగుండం | మహంకాళి స్వామి (కాంగ్రెస్) | పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్) |
| నిజామాబాద్ | ఉమారాణి (కాంగ్రెస్) | సల్మా తహసీన్ (ఎంఐఎం) |

తెలంగాణలో మేయర్, చైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. సోమవారం పలు చోట్ల ఉద్రిక్తల నడుమ ఈ ఎన్నికలు జరుగగా మరికొన్ని చోట్ల వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపల్ కార్పొరేషన్లకు చైర్మన్, వైస్ చైర్మన్, ఏడు కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 11 మున్సిపాలిటీల్లో వాయిదా పడ్డాయి. ఎన్నిక నిర్వహణకు అనుకూల వాతావరణం లేకపోవడంతో ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా నేడు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. కాగా కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేసి.. మేయర్, డిప్యూటీ మేయర్‌లను ఎన్నుకున్నారు. మొత్తం ఏడు చోట్ల ఎన్నికలు జరగ్గా అందులో 5 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. సీపీఐ, బీజేపీ పార్టీలు చెరో మిగతా 02లో


వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య

# వరల్డ్ కప్ నుంచి ఆస్ట్రేలియా ఔట్

### భారీ చేజింగ్ ను అలవోకగా చేసిన శ్రీలంక

- సెంచరీతో దుమ్ముదులిపిన నిస్సంక
- విరుచుకుపడ్డ మెండిస్
- ఒకప్పటి వరల్డ్ ఛాంపియన్ అసీస్ కు ఇది ఘోర అవమానం

02



# ప్రపంచం భారత్‌కు వస్తోంది

## ఇండియా ఏఐ సమ్మిట్‌పై ప్రధాని మోదీ

### ప్రపంచాన్ని ఢిల్లీకి రప్పిస్తున్న ఏఐ సమ్మిట్

- ఏఐతో కొత్త యుగానికి భారత్ నేతృత్వం
- గ్లోబల్ వేదికగా 'ఇంపాక్ట్ సమ్మిట్'
- భారత్ మండపంలో ఏఐ మహాసమ్మేళనం
- ప్రపంచ నిపుణుల సందడి
- స్టార్టప్‌లు, టెక్ దిగ్గజాల మహాసంగమం
- ఏఐ ఎక్స్‌పోకి భారీ స్పందన
- 22 భాషల్లో స్వదేశీ ఏఐ మోడళ్లు
- గ్లోబల్ సౌత్‌కు భారత్ దిశానిర్దేశం

10



# శశికళ కొత్త పార్టీ!

- చిన్నమ్మ రీఎంట్రీతో తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- శశికళ కొత్త పార్టీపై ఆసక్తి... అన్నాడీఎంకేకు సవాలా?
- జయలలిత వారసత్వం కోసం శశికళ కొత్త రాజకీయ ప్రయోగం
- తమిళనాడులో ఓట్ల చీలికకు కారణమవుతుందా చిన్నమ్మ పార్టీ?
- ఫిబ్రవరి 24పై దృష్టి.. శశికళ భవిష్యత్తు ఏ దిశలో?

09





# ఈ ఫలితాలు వారికి చెంపపెట్టు

03

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అంటే నిరూపించాం
- 95 మున్సిపాలిటీల కైవసం చారిత్రక విజయం

# నిజామాబాద్‌లో సీన్ రివర్స్ చేస్తా

## ఎంపీ ధర్మపురి అర్వింద్ హెచ్చరిక

- మేయర్ పదవి బీజేపీదే అవుతుంది
- కాంగ్రెస్-బీఆర్ఎస్-ఎంఐఎం అనైతిక పొత్తుతో నష్టం
- అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై మండిపాటు.. కేటీఆర్, రేవంత్ పై తీవ్ర విమర్శలు
- పోలీసుల పాత్రపై అనుమానాలు

03



# రైతులకు శుభవార్త..

## సన్న వడ్లు సాగు చేస్తున్న వారికి రూ.514 కోట్ల బోనస్ విడుదల

- క్వింటాల్‌కు రూ.500 అదనంగా.. 2.17 లక్షల రైతులకు లబ్ధి
- బోనస్ బకాయిలు క్లియర్ చేసిన ప్రభుత్వం.. రైతుల్లో ఆనందం
- మద్దతు ధరపై అదనపు బోనస్.. సన్న రకాల ధాన్యానికి ప్రోత్సాహం
- పంట ఖర్చులకు ఊరట.. సన్న వడ్ల రైతులకు భారీ సహాయం

03



# కాంగ్రెస్ నేతలకు నోటీసులు

## మోదీ, స్పీకర్‌పై ఏఐ వీడియో ప్రచారం ఆరోపణలు

- సభా హక్కుల ఉల్లంఘనపై కాంగ్రెస్ నేతలకు నోటీసులు
- మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని లోక్‌సభ సచివాలయం ఆదేశం
- రేణుకా చౌదరికి కూడా ప్రివిలేజ్ కమిటీ నోటీసులు
- పార్లమెంటు కాంప్లెక్స్ ఘటనలపై చర్యలకు రంగం సిద్ధం

03



# ఏడడుగులు వేయనున్న విజయ్, రష్మిక

### ఉదయపూర్ వేదికగా పెళ్లి

12



టాలీవుడ్‌లో ఎన్నాళ్లుగానో చర్చనీయాంశంగా మారిన విజయ్ దేవరకొండ–రష్మిక మందన్న ప్రేమ కథ ఇప్పుడు పెళ్లి పీటలెక్కబోతోందన్న వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. రాజస్థాన్‌లోని ఉదయపూర్ వేదికగా ఈ నెల 26న ఈ స్టార్ జంట ఏడడుగులు వేయనున్నట్లు సమాచారం.

# బిల్ గేట్స్-ఏపీ సర్కార్ ఒప్పందం

### ఆరోగ్యం, వ్యవసాయం, విద్యారంగాల బలోపేతం

- పలు అంశాలపై బిల్ గేట్స్ తో చంద్రబాబు చర్చలు
- ఆర్టీజీఎస్ సాంకేతికత వినియోగం పరిశీలన
- ఉండవల్లి వద్ద వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన బిల్ గేట్స్
- వ్యవసాయంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీస్ బిల్ గేట్స్ పరిశీలన
- గేట్స్ ఫౌండేషన్తో చేపట్టిన ప్రాజెక్టులు విస్తరించే అవకాశం

09





# ఇంకెంత కాలం అవమానాలు..?

## ఇలా అయితే పార్టీలో కొనసాగింపుపై ఆలోచిస్తా

- నా రాజకీయ భవిష్యత్ ఏంటో గోచరించట్లేదు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

02



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 17.02.2026
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 1 కారు
మారుతి సుజుకి స్విఫ్ట్

మంచి మైలేజ్, తక్కువ మెయింటెనెన్స్తో మిడిల్ క్లాస్కు బెస్ట్ ఎంపిక. సిటీ డ్రైవింగ్కి ఈజీగా ఉండే హ్యాచ్‌బ్యాక్.

# ‘హస్త’గతం



(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్‌పై తమ జెండా ఎగురవేసుకున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగే ఆఖరి క్షణం వరకూ పార్టీలన్నీ.. పదవులు దక్కించుకునేందుకు అస్త్రశస్త్రాలు ప్రదర్శించాయి. మరోవైపు.. 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరిగినప్పటికీ హంగ్ ఏర్పడిన కారణంగా.. 11 పురపాలికల్లో ఛైర్మన్ల ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. మిగిలిన వాటిలో చాలా వరకు అధికార కాంగ్రెస్ పార్టీ ఛైర్మన్ పీఠాలను దక్కించుకోగా.. బీజేపీ, ఎంఐఎం పార్టీలు కైవసం చేసుకున్నాయి.

**కరీంనగర్ లో వికసించిన కమలం**

త నాలుగు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 66 స్థానాలకు గాను 30 కార్పొరేటర్లను గెలుచుకున్న బీజేపీ మొదటి నుంచి మేయర్ రేసులో కొనసాగింది. మధ్యలో మంత్రి పొన్నం ప్రభాకర్ తాము కూడా రేసులో ఉన్నామంటూ ప్రకటించడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్రులతో కలిపి ఆ పార్టీకీ బలం లేకపోవడంతో బీఆర్ఎస్ మద్దతు అనివార్యం అయింది. కానీ చివరి నిమిషంలో బీఆర్ఎస్ పార్టీ మేయర్ ఎన్నికకు దూరంగా ఉంటామని ప్రకటించడంతో బీజేపీ లైన్ క్లియర్ అయింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 69 ఓట్లు ఉండగా.. బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్ కు 34 ఓట్ల మద్దతు లభించింది. దీంతో ఆయన కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా ఎన్నుకోబడ్డారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు గెలిచారు. కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపిన మేయర్ అభ్యర్థికి కేవలం 21 మంది కార్పొరేటర్ల మద్దతే లభించింది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించడంతో కరీంనగర్ మేయర్ పీఠం కమలదళం వశమైంది. ఇక డిప్యూటీ మేయర్‌గా బీజేపీకి చెందిన సునీల్‌రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆశయం నెరవేరి.. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా రెపరెపలాడింది. ఆ కార్పొరేషన్‌లోని మొత్తం 66 డివిజన్లకు బీజేపీ 30 డివిజన్లలో గెలిచింది.

**రాష్ట్రంలో 116 పుర పీఠాల్లో ఎవరికి ఎన్ని**

| | |
|---|---|
| కాంగ్రెస్ | 81 |
| బీఆర్ఎస్ | 18 |
| బీజేపీ | 01 (నారాయణపేట) |
| ఇతరులు | 05 |
| మొత్తం | 105 |

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిలిచిపోయిన మున్సిపాలిటీలు : 11

బీఆర్ఎస్ కైవసం చేసుకున్న మున్సిపల్ ఛైర్మన్ల పీఠాలు (17) :
గడ్డపోతారాం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, అయిజ, మూడు చింతపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల. సిరిసిల్ల, ఆలంపూర్.

బీఆర్ఎస్ కు అవకాశం ఉండి వాయిదా పడ్డవి:
జనగాం, తొర్రూరు, ఇబ్రహీంపట్నం, జమ్మికుంట, క్యాతనపల్లి.

బీఆర్ఎస్ కు స్పష్టమైన మెజారిటీ ఉన్నా దక్కని మున్సిపాలిటీ : ఆమనగల్లు

**కొత్తగూడెం కార్పొరేషన్ (సీపీఐ)**

కొత్తగూడెం కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్‌గా 20వ డివిజన్ నుంచి సీపీఐ తరఫున గెలిచిన మూడ్ గణేష్ నిలిచారు. ఇక డిప్యూటీ మేయర్‌గా ఎనిమిదో డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన సిరిపురపు లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నిజామాబాద్** మేయర్ పీఠాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నిజామాబాద్‌లో అత్యధిక స్థానాలు గెలిచిన బీజేపీ మొదటి నుంచి మేయర్ పీఠం తమదేనని ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. కాంగ్రెస్, ఎంఐఎం కలిసిపోవడంతో అది ఫలించలేదు. నిజామాబాద్ మేయర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూరగాయల ఉమారాణి ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా ఎంఐఎంకు చెందిన సల్మా తహసీన్‌ను ఎన్నుకున్నారు.

**మహబూబ్‌నగర్** కార్పొరేషన్ హస్తగతమైంది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా మమత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా సురేందర్ రెడ్డిని ఎన్నుకున్నారు.

**రామగుండం కార్పొరేషన్ (కాంగ్రెస్)**

రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ వశమైంది. మేయర్‌గా 46వ డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా 57వ డివిజన్ కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్యను ఎన్నుకున్నారు.

**నల్గొండ కార్పొరేషన్ (కాంగ్రెస్)**

తొలిసారిగా నల్గొండ కార్పొరేషన్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. నల్గొండ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 48 డివిజన్లు ఉండగా.. కాంగ్రెస్ 27, బీఆర్ఎస్ 9, బీజేపీ 4, ఎంఐఎం 2, ఏఐఎఫ్‌బీ 4, ఇండిపెండెంట్లు రెండు స్థానాల్లో గెలిచారు. డిప్యూటీ మేయర్‌గా అష్రాఫ్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. ముగ్గురు ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మంచిర్యాల కార్పొరేషన్ (కాంగ్రెస్)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ హస్తగతమైంది. తొలి మేయర్‌గా ధర్ణి మధు ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా రమ్యను ఎన్నుకున్నారు.

**బైంసా** మున్సిపాలిటీలో భాజపా, ఎంఐఎం, కాంగ్రెస్, స్వతంత్రుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి తూమెల్ల దత్తాత్రి ఛైర్మన్‌గా, ఖతుజా సిద్ధికి ఇద్రిస్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**‘గూడెం’ యూటర్న్ తో చేజారిన ఐదు పీఠాలు**

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యూహంతో సంగారెడ్డి జిల్లా పటాన్చెరు సెగ్మెంట్ లో బీఆర్ఎస్ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. ఇప్పటికే గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలను స్పష్టమైన ఆధిక్యంతో కైవసం చేసుకున్న ఆ పార్టీ సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠాన్ని సైతం చేజిక్కించుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా మోటె సుమలత, వైస్ ఛైర్మన్‌గా పట్లోళ్ల మాధవి ఎన్నికయ్యారు. మరోవైపు.. ఎక్స్ అఫిషియో ఓటు వేసి తిరిగి వెళ్తున్న గూడెం మహిపాల్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటింగ్ ఎలా జరిగిందని ప్రశ్నించగా.. కాంగ్రెస్ పార్టీ, స్థానిక నేతను ఉద్దేశించి ‘బుల్లెట్ దిగిందా లేదా’అని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాగా ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 12, స్వతంత్రులు 4 వార్డుల్లో విజయం సాధించారు. అందులో ముగ్గురు ఇండిపెండెంట్లు కాంగ్రెస్‌లోకి వెళ్లగా ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో రెండు పార్టీల సంఖ్య 13కు చేరింది. దీంతో మున్సిపాలిటీ కైవసం చేసుకుంటామని ధీమాతో ఉన్న కాంగ్రెస్‌కు ఎంపీ రఘునందన్ రావు షాకిచ్చారు. ఆయన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో ఒకే వాహనంలో ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఎక్స్ అఫీషియో ఓటు వేయడంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ గులాబీ వశమైంది.

బైంసా మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోయాయి. పార్టీల బలాబలాలను తలకిందులు చేస్తూ బైంసా మున్సిపల్ పీఠాన్ని స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకోవడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. మున్సిపల్ ఛైర్మన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి తుమ్మెల్ల దత్త్రి, వైస్ ఛైర్మన్‌గా మరో ఇండిపెండెంట్ అభ్యర్థి బిబి కుతిజ సిద్దికి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఒకరు కాదు ఇద్దరు కాదు, ఏకంగా ఆరుగురు బీజేపీ అభ్యర్థులు, ఏడుగురు స్వతంత్రులు, ఒక కాంగ్రెస్ అభ్యర్థి కలిసి ఈ స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం. ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉంటుందని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అభ్యర్థులంతా ఏకమై ఇండిపెండెంట్లను గెలిపించుకోవడం విశేషం. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ తన ఎక్స్–అఫీషియో ఓటును వీరికి అనుకూలంగా వినియోగించడంతో స్వతంత్రుల విజయం ఖాయమైంది. సాధారణంగా మున్సిపల్ పీఠాలపై ప్రధాన పార్టీల జెండాలు ఎగురుతుంటాయి, కానీ బైంసాలో మాత్రం స్వతంత్ర అభ్యర్థులు జైత్రయాత్ర సాగించారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం స్వతంత్రులుగా ఉన్న వారిలో అధికంగా బీజేపీ రెబల్ అభ్యర్థులే ఉన్నట్లు తెలుస్తుంది.

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన కామారెడ్డి మున్సిపాలిటీలో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రోజూ మాటల యుద్ధం జరుగుతున్న వేళ కామారెడ్డిలో మాత్రం ఆ రెండు పార్టీలు కలిసిపోయి అందరినీ షాక్ కు గురి చేశాయి. అక్కడి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులను రెండు పార్టీలు పంచుకున్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ 19, బీజేపీ 16, బీఆర్ఎస్ 11, స్వతంత్రులు 3 గెలిచారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసిపోయి మున్సిపాలిటీని దక్కించుకున్నాయి. 38వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆమెను మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఇక వైస్ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ నుంచి 12వ వార్డు నుంచి గెలిచిన కాసర్ల గోదావరి ఎన్నికయ్యారు.

**మేడ్చల్ జిల్లా అలియాబాద్** మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. దీంతో గత 3 రోజులుగా అక్కడ తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది. అలియాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. అందులో కాంగ్రెస్ పార్టీకి 8, బీఆర్ఎస్ పార్టీకి 7, బీజేపీకి 3, ఇతరులు 2 స్థానాల్లో విజయం సాధించారు. అయితే ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఎవరు మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటారనే ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఛైర్మన్ ఎన్నికలో బీజేపీ, ఇతరుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కంఠం శిరీష అలియాబాద్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైయ్యారు.

**తొర్రూర్ లో రభస**

తొర్రూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పరిస్థితి రణరంగాన్ని తలపించింది. ఓటింగ్ జరుగుతున్న సమయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన్ను పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఓ క్రమంలో కాంగ్రెస్ నేతలు ఎర్రబెల్లి పీఏపై దాడి చేశారు. పోలీసుల తీరుపై మండిపడ్డ ఎర్రబెల్లి దయాకర్ రావు ఝాన్సీరెడ్డి ని లోనికి అనుమతించి.. తనను పంపకపోవడం ఏంటని ప్రశ్నించారు. అమెరికా పౌరసత్వం ఉన్న ఝాన్సీకి మీటింగ్‌లో కూర్చునే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. ఛైర్మన్ ఎన్నిక వేళ తాను పార్టీ సభ్యులకు విప్ జారీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన పత్రాలను ఆర్డీవోకు ఇవ్వడానికి తాను అక్కడికి వెళ్లానని స్పష్టత ఇచ్చారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు తనపై అకారణంగా దౌర్జన్యం చేశారని ఎర్రబెల్లి సంచలన ఆరోపణలు చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 వార్డుల్లో గెలుపొందింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓట్లు నమోదు చేయించుకోవడంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. ఛైర్మన్ ఎన్నికకు ఇరు పార్టీల సంఖ్య సమంగా ఉండటంతో లాటరీ పద్ధతిని ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

**వనపర్తి కాంగ్రెస్ పార్టీలో** ముసలం పుట్టింది. ఛైర్మన్ పదవిని ఆశించి భంగపడ్డ ఆ పార్టీ సీనియర్ నేత చీర్ల చందర్, మూడోవార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆయన చీర్ల రజిని పార్టీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం భార్యభర్తలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగిందని వాపోయారు. పార్టీకి విధేయులుగా ఉన్న తాము ఎమ్మెల్యే గెలుపు కోసం కృషిచేశామని చెప్పారు. కానీ రాజకీయంగా అనుభవమున్న తమను కాదని, అనుభవం లేని ఇతర వ్యక్తులకు చైర్మన్ పదవి ఇచ్చిన పార్టీ పెద్దల తీరును అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవి ఆశిస్తున్న వ్యక్తులను కనీసం కూర్చోబెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలి కానీ, అలా జరగలేదని ఆరోపించారు. అధిష్టానం నుంచి నిర్ణయం సీల్డ్ కవర్లో వస్తుందని చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందే ఎంపీకి మా వనపర్తి మున్సిపల్ చైర్మన్ వీరే అని చెప్పి పరిచయం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తన భార్యకు చైర్మన్ పదవి రానందుకు తాను, నా సతీమణి పార్టీతో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన చీర్ల చందర్.. రాజీనామా లేఖను ఆర్డీవోకు అందజేశామని చెప్పారు.

**జనగామలో రణరంగం...**

జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయం వద్ద చోటు చేసుకున్న ఆందోళనలు, కౌన్సిల్ హాల్‌లో సభ్యుల మధ్య నెలకొన్న గందరగోళం వల్ల సభ నియంత్రణలో లేదని, అందుకే ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. ఈ మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డులు ఉండగా కాంగ్రెస్ 12 వార్డుల్లో విజయం సాధించింది. దాని మిత్రపక్షమైన సీపీఎం ఒక వార్డును దక్కించుకుంది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా 13 సీట్లలో గెలిచింది. మరో నలుగురు ఇండిపెండెంట్లు గెలిచారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. బీఆర్ఎస్ నేత, జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మళ్లీ ఇరుపార్టీలకు సమానంగా చెరో 14 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దృష్టి మొత్తం ఇండిపెండెంట్ కౌన్సిలర్లపై పడింది. నలుగురు స్వతంత్ర అభ్యర్థుల్లో కాంగ్రెస్‌కు ఇద్దరు, బీఆర్ఎస్‌కు ఇద్దరు మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారం జరగడంతో జనగామ మున్సిపల్ రాజకీయాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. ఎన్నికకు ముందు జనగామలో కిడ్నాప్ కథనాలు కలకలం రేపాయి. తమ కౌన్సిలర్లను ప్రత్యర్థి పార్టీలు కిడ్నాప్ చేశాయని ఒక వర్గం ఆరోపించగా, పోలీసుల ఒత్తిడితో అక్రమంగా కేసులు పెడుతున్నారని మరో వర్గం నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయం వెలుపల వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా గుమిగూడి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఎన్నిక వాయిదా పడటంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. తాము విజయం సాధిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను పోస్ట్‌పోన్ చేయించిందని మండిపడ్డారు. అధికారుల తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని, కలెక్టర్ , పోలీస్ విభాగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు.

మున్సిపల్ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన తనను నామినేటెడ్ ఎమ్మెల్సీగా గుర్తిస్తూ తనకు రాజ్యాంగబద్ధంగా లభించే ఎక్స్ అఫీషియో ఓటు హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నిరాకరించారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేస్తూ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా లోకల్ కౌన్సిలర్లు ఓటు వేస్తేనే గెలిచిన తనకు వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడైనా మున్సిపల్ చైర్మన్ కోసం ఎక్స్ అఫీషియో ఓటు వినియోగించుకునే హక్కు తనకు ఉంటుందన్నారు. కానీ, ఆ హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాయడం ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు.

**నల్లగొండ** మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ నూతన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు నా కల.. ఆ కల సాకారమై, ఇవాళ అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేస్తుంటే నా మనసు గర్వంతో నిండిపోయింది. నల్లగొండ నా జన్మభూమి, ఇక్కడి ప్రతి గల్లీ నా గుండె చప్పుడు. నల్లగొండను కేవలం ఒక పట్టణంగా కాదు, దేశం గర్వించేలా ఒక 'క్లీన్ – గ్రీన్ – స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే నా జీవిత ఆశయం. రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో సైతం అభివృద్ధి గంగా ప్రవాహంలా సాగుతుంది. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరడమే నా బాధ్యత. మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి, డిప్యూటీ మేయర్‌కి మరియు నూతన కార్పొరేటర్లకు నా అభినందనలు. నాటి ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుండి నేటి స్మార్ట్ సిటీ నిర్మాణం వరకు.. మీ 'కోమటిరెడ్డి' ఎప్పుడూ మీ తోడుగానే ఉంటాడు. మనందరం కలిసి నవ నల్లగొండను నిర్మిద్దాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.

**ఏ పార్టీకి ఎన్ని స్థానాలంటే?**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 87 చోట్ల విజయకేతనం ఎగురవేయగా, బీఆర్ఎస్ 17 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ ఒక్క చోటుకు పరిమితమైంది. మరో 11 చోట్ల ఫలితాలు వాయిదా పడ్డాయి. ఇక 7 కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ 5 కైవసం చేసుకుంది. బీజేపీ ఒకటి, సీపీఐ–మిత్రపక్షం మరొక కార్పొరేషన్‌లో విజయం సాధించాయి. ఈ ఫలితాలు పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలాన్ని మరోసారి నిరూపించాయి.



# ఇంకెంతకాలం అవమానాలు..?

**ముద్ర, జగిత్యాల :**

దశాబ్దాల కాలం కాంగ్రెస్ లో ఉన్న తాను ప్రస్తుతం అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగాలంటే ఆలోచించే పరిస్థితి వచ్చిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన భవిష్యత్ ఏంటో గోచరించట్లేదన్న ఆయన కాంగ్రెస్‌లో కొనసాగాలా.. వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నానని చెప్పారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంత వరకు వేధింపులు తప్పవని కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక అంశంలో తాను ప్రతిపాదించిన వారిని కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడాన్ని జీవన్ రెడ్డి ఖండించారు. జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వాణి పేరును పార్టీ దాదాపు ఖరారు చేయడంతో షాక్ కు గురైన ఆయన సోమవారం జగిత్యాలలో మీడియాతో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కు కాంగ్రెస్ పవర్ ఆఫ్ అటార్నీ రాసిచ్చారా?.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారా అని అధిష్టానాన్ని నిలదీశారు. స్పీకర్ ఏమో ఎమ్మెల్యే పార్టీ మారలేదు అంటున్నాడు.. ఎమ్మెల్యే సంసారం మాత్రం కాంగ్రెస్ పార్టీతో చేస్తున్నాడని ఆరోపించారు. జగిత్యాలలోనే ఇలా ఉంటే పార్టీ మారిన మరో తొమ్మిది ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో అర్థం కావడం లేదన్నారు. అధినాయకత్వం కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు గౌరవించాలని కోరారు.

# చిరంజీవి చేతికి సర్జరీ..

ముద్ర, మూవీ డెస్క్:
అగ్ర కథానాయకుడు చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా చిరు పోస్ట్ పెట్టారు. తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

‘‘చేతికి పట్టీ ఉండటం గమనించి పలువురు శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ–హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను బాగానే కోలుకుంటున్నా. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ఆయన నైపుణ్యంతో ఆ ప్రక్రియ అంతా సజావుగా, సౌకర్యవంతంగా సాగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉంది’’ ఎక్స్ వేదికగా చిరంజీవి వెల్లడించారు.



అల్లు శిరీష్ వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను చిరంజీవికి అందించారు. అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ స్వయంగా చిరు ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలతో పాటు వివాహ ఆహ్వాన పత్రికను అందించి పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి చేతికి కట్టు ఉండటం గమనించి పలువురు అభిమానులు ఆందోళన చెందారు. ఆయనకు ఏమైందంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో చిరంజీవి స్వయంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు.

ఇక చిరు సినిమాల విషయానికొస్తే, ఇటీవల ‘మన శంకరవరప్రసాద్‌గారు’ మూవీతో చిరంజీవి ఘన విజయాన్ని అందుకున్నారు. బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం ఓటీటీలోనూ అలరిస్తోంది. దీని తర్వాత బాబీ దర్శకత్వంలో రూపొందబోయే సినిమా కోసం చిరు సిద్ధమవుతున్నారు. 70ఏళ్ల వయసులోనూ యువ కథానాయకులకు దీటుగా సినిమాలు చేస్తూ అలరిస్తున్నారు.

# టీ20 వరల్డ్ కప్ నుంచి ఆస్ట్రేలియా ఔట్

ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి జట్లలో ఒకటైన ఆస్ట్రేలియా జట్టుకు టీ20 వరల్డ్ కప్‌లో చేదు అనుభవం ఎదురైంది. ఒకప్పటి వరల్డ్ ఛాంపియన్ అయిన అసీస్ జట్టు ఈసారి టోర్నీ నుంచి నిష్క్రమించడం అభిమానులను నిరాశకు గురిచేసింది. కీలక మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో పరాజయం పాలవడంతో ఆస్ట్రేలియా ప్రయాణం ముగిసింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు మంచి స్కోర్ నమోదు చేసినప్పటికీ, బౌలింగ్ విభాగంలో విఫలమైంది. పెద్ద లక్ష్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, లంక బ్యాట్స్‌మెన్ దూకుడుగా ఆడడంతో అసీస్ బౌలర్లు పూర్తిగా ప్రభావం చూపలేకపోయారు.

లక్ష్య ఛేదనలో శ్రీలంక ఓపెనర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా పాథుమ్ నిస్సంక అసాధారణ ఇన్నింగ్స్‌తో సెంచరీ సాధించి జట్టును విజయానికి దగ్గర చేశాడు. అతని బ్యాటింగ్‌లో స్థిరత్వం, శాట్ల ఎంపిక విశేషంగా నిలిచాయి. మరోవైపు కుసాల్ మెండిస్ కూడా దూకుడుగా ఆడి రన్స్ వేగాన్ని పెంచాడు. ఇద్దరూ కలిసి ఆస్ట్రేలియా బౌలర్లను కట్టడి చేస్తూ మ్యాచ్‌ను పూర్తిగా తమవైపు తిప్పుకున్నారు.

శ్రీలంక బ్యాటింగ్‌లో ఎలాంటి ఒత్తిడి కనిపించలేదు. భారీ లక్ష్యాన్ని కూడా అలవోకగా చేజ్ చేసి తమ సత్తాను చాటుకుంది. ఈ విజయం లంక జట్టుకు పెద్ద ఊరటనివ్వడమే కాకుండా, టోర్నీలో ముందడుగు వేయడానికి కీలకంగా మారింది.

మరోవైపు ఆస్ట్రేలియా జట్టు ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురవుతోంది. బౌలింగ్, ఫీల్డింగ్‌లో జరిగిన తప్పిదాలు జట్టును కష్టాల్లోకి నెట్టాయి. ఒకప్పటి వరల్డ్ ఛాంపియన్ అయిన జట్టు ఈ విధంగా టోర్నీ నుంచి నిష్క్రమించడం అభిమానులకు పెద్ద షాక్‌గా మారింది.

ఈ మ్యాచ్‌తో శ్రీలంక జట్టు తన బలం మరోసారి నిరూపించగా, ఆస్ట్రేలియా మాత్రం తమ ప్రదర్శనపై మళ్లీ ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీ20 ఫార్మాట్‌లో ఎవరైనా గెలవొచ్చు అన్న విషయాన్ని ఈ మ్యాచ్ స్పష్టంగా చూపించింది.

దేశంలో టాప్ 2 కారు
టాటా నెక్సాన్
5 స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో ఫ్యామిలీకి సేఫ్ SUV. డీజిల్, పెట్రోల్, ఎలక్ట్రిక్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి.



# 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆర్.కృష్ణయ్య డిమాండ్



**ముద్ర, దేవరకొండ :**

బీసీల కుల గణన చేపట్టి, చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండ నియోజకవర్గంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బీసీ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఆయన శాలువా కప్పి, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై ప్లాస్టిక్ వినియోగం పర్యావసనాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆర్.కృష్ణయ్య బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.అరుణ్ కుమార్, వరికుప్పల శ్రీను, వెంకటయ్య, ఏరుకొండ రాము, చోల్లేటి భాస్కరాచారి, భీమగోని శివ గౌడ్, చెరుపల్లి జయలక్ష్మి, వనం చంద్రకళ, కొండ్ర శ్రీశైలం యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి

- తొమ్మిది మంది కాంగ్రెస్ నేతలకు నోటీసులు
- పీఎం, లోక్ సభ స్పీకర్ పై ఏఐ వీడియో ప్రచారంపై సీరియస్

**న్యూఢిల్లీ :**

తొమ్మిది మంది కాంగ్రెస్ నేతలకు లోక్‌సభ సచివాలయం సోమవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ ఓంబిర్లాపై ఏఐ వీడియో ప్రచారం చేశారని ఆ నోటీసుల్లో పేర్కొంది. దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని గడువు విధించింది. సభా హక్కులు ఉల్లంఘించి తప్పుడు వీడియోను ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడింది. మరోవైపు ఇప్పటికే రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. తాజాగా పార్లమెంటు కాంప్లెక్స్‌లోకి వీధి కుక్కను తీసుకురావడంతో పాటు, ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలకు కమిటీ సిద్ధమైంది. ఎంపీ రేణుకా చౌదరిపై బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదును రాజ్యసభ ప్రివిలేజ్ కమిటీ స్వీకరించింది. ఈ నెల 23లోగా దీనిపై వివరణ ఇవ్వాలని ఆమెను ఆదేశించినట్టు తెలిసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 1న ఎంపీ రేణుకా చౌదరి ఒక వీధి కుక్కను తన కారులో పార్లమెంటు కాంప్లెక్స్ లోకి తీసుకువచ్చారు.

# ఏపీలో టోర్నడోలు..

## చూస్తుండగానే బీభత్సం పొంచి ఉన్న ముప్పు?



**ముద్ర, ఆంధ్రప్రదేశ్:**

సాధారణంగా టోర్నడోలు ఎక్కడో విదేశాలలో చోటుచేసుకుంటాయి. అమెరికా వంటి దేశాలలో సుడిగుండాలు సర్వసాధారణం. సముద్రంలో ఏర్పడే సుడిగుండాలు విపరీతమైన నష్టాన్ని కలగజేస్తాయి. ప్రాణ నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విదేశాలలో ఏర్పడే సుడిగుండాలు.. ఇప్పుడు ఏపీలో కూడా చోటుచేసుకున్నాయి. ఏపీలో కోస్తా ప్రాంతంలో ఉన్న అనకాపల్లి పట్టణంలో సుడిగుండం ఏర్పడింది. ఎన్టీఆర్ స్టేడియంలో ఒక్కసారిగా సుడిగుండం ఏర్పడి బీభత్సం సృష్టించింది. సుమారు 100 అడుగుల ఎత్తున ఎగిసిన సుడిగుండం.. పట్టణంలో భయాందోళనకు కారణమైంది. కొంతమంది సుడిగుండాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారు. ఈ వీడియో కాస్త విపరీతంగా సర్క్యులేట్ అయింది. ఫలితంగా ఏపీలో ఏదో జరుగుతోందనే అనుమానం మొదలైంది. ఇటీవల కాలంలో ఏపీలో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సుడిగాలుల వంటి సంఘటనలు చోటు చేసుకున్న దాఖలాలు లేకపోయినప్పటికీ.. ఈ తరహా సుడిగాలులు సముద్ర తీర ప్రాంతమైన విశాఖపట్నంలో చోటుచేసుకున్నాయని ఏపీ వాసులు చెబుతున్నారు. ఎన్నడూ కూడా సుడిగాలులు ఈ స్థాయిలో ఏర్పడలేదని ఏపీ ప్రజలు చెబుతున్నారు. దీనివల్ల ఏమైనా నష్టం జరుగుతుందా? భవిష్యత్తు కాలంలో జరిగే నష్టానికి ప్రకృతి ఇప్పుడే సంకేతాలు పంపించిందా? అనే ప్రశ్నలు ఏపీ ప్రజలలో వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బ్లో అవుట్ సంభవించింది. చాలా రోజుల వరకు ఆ మంటలు తగ్గలేదు. ఇప్పుడిప్పుడే ప్రజలు ఆ ఘటన నుంచి తేరుకుంటున్నారు. దానిని మర్చిపోకముందే ఇప్పుడు సుడిగుండం ఏర్పడటం సంచలనం కలిగిస్తోంది. "ఉన్నట్టుండి వాతావరణం పూర్తిగా మారిపోయింది. అకస్మాత్తుగా గాలి వచ్చేసింది. భారీగా శబ్దం కూడా వచ్చింది. ఆ సమయంలో ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. మొత్తానికి ఏదో విపత్తు మాదిరిగానే కనిపించింది. ఇటువంటి సుడిగుండాలు గతంలో మేము ఎన్నడూ చూడలేదని" అనకాపల్లి పట్టణవాసులు చెబుతున్నారు.

# ఈ ఫలితాలు వారికి చెంపపెట్టు

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అంటే నిరూపించాం
- 95 మున్సిపాలిటీల కైవసం చారిత్రక విజయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ముద్ర, మధిర :**

కాంగ్రెస్ ను గ్రామీణ పార్టీతో పోల్చి.. బురద చల్లిన వారికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటర్లు భారీ మెజారిటీని కట్టబెట్టారన్న భట్టి... ఇంతటి విజయాన్ని అందించిన ప్రతి ఓటరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిరలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఉంచిన నమ్మకమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయం అని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగేలా తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని భట్టి తెలిపారు. తమ పోటీ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదన్న ఆయన ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతోనే పోటీ పడుతున్నామన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పారిశ్రామికీకరణ ద్వారా భారీగా ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. విస్తరిస్తున్న పట్టణాలను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ శాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్యూర్ క్యూర్ రేర్" విధానంతో ముందుకు సాగుతున్నారన్నారు. మున్సిపల్ పరిపాలనలో జవాబుదారీతనం పెంచడానికి, పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్యూర్ క్యూర్ రేర్" లక్ష్యమన్నారు.

# సీన్ రివర్స్ చేసి చూపిస్తా..

- పాలక వర్గం పదవి కాలం పూర్తయ్యేలోపు నిజామాబాద్ పీఠం ఎక్కుతాం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



**ముద్ర, నిజామాబాద్:**

నిజామాబాద్ కార్పొరేషన్ పాలక వర్గం పదవి కాలం పూర్తయ్యేలోపు సీన్ రివర్స్ చేసి చూపిస్తామని స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తి కాకుండానే ఇక్కడ బీజేపీని మేయర్ పీఠం ఎక్కిస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తుతో బీజేపీ మేయర్ పీఠం చేజారిందన్నారు. అన్ని పార్టీలు కలిసి బీజేపీని స్వల్ప మెజారిటీతో ఓడించాయన్నారు. సోమవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ కు వచ్చిన అక్బరుద్దీన్ హిందువులను దూషించినా ఆత్మభిమానాన్ని అంతా చంపుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిసిపోయాయని మండిపడ్డారు. కరీంనగర్‌లో మేయర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ నిజామాబాద్‌లో మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంపై స్పందిస్తూ బీఆర్ఎస్ కు కరీంనగర్ మీదనే ఎందుకు ప్రేమ ఉంది నిజామాబాద్ పై ఎందుకు లేదో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిని నార్కో పరీక్షలు నిర్వహిస్తే నిజం చెప్తారేమో అన్నారు.

**కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ కాపాడుతున్నడు**

కాళేశ్వరం, ఈ కార్ రేస్ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు?, ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు, ఫోరెన్సిక్ ల్యాబ్ బిల్డింగ్ ఎందుకు కాలిపోతుంది అనేది ఈ పొత్తులతో తేలిపోయిందని ఎంపీ అర్వింద్ వెల్లడించారు. నిజామాబాద్ లో బీజేపీని ఓడించేందుకు అనైతిక పొత్తుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుడితే ఇందుకు పోలీసులు కూడా సహకరించారని ఆరోపించారు. కొంత మంది పోలీసులు రంగుపులుముకుని వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్ ను ఎత్తుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా పోలీసులు చేశారని ఆరోపించారు.

# సన్నాలకు రూ.514.36 కోట్ల బోనస్

- 2.17 లక్షల మంది రైతులకు లబ్ది

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రజాప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కార్... దానికి సంబంధించిన రూ.514.36 కోట్లు సోమవారం విడుదల చేసింది. వానాకాలంలో సన్నవడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు ఈ బోనస్ బకాయిలు విడుదల చేసింది. ఈ బోనస్, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అదనంగా లభిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల సన్నబియ్యం రకాలను పండించిన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ధాన్యంలో తేమశాతం, గింజ నాణ్యతను బట్టి ఈ బోనస్ ఖరారు చేస్తారు. గత కొంతకాలంగా బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన రైతులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. పంట పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ అదనపు రూ.500 తోడుగా నిలవనుంది.



# తెలంగాణలో మరో కొత్త రైల్వే లైన్



**ముద్ర, తెలంగాణ:**

కేంద్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్ల విస్తరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే కన్నా రోడ్ల విస్తరణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అనేక రహదార్లును జాతీయ రహదారులుగా మార్చింది. తాజాగా కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన వికారాబాద్-కృష్ణా రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక రైల్వే బోర్డుకు చేరింది. రూ.2,750 కోట్ల వ్యయంతో 130.28 కిమీ దూరం విస్తరించిన ఈ మార్గం ఆమోదం పొందితే పరిగి, కొడంగల్, మక్తల్, నారాయణపేటలకు రైలు కనెక్టివిటీ వస్తుంది.

**ప్రాజెక్టు వివరాలు..**

తొలుత 120 కిమీగా డీపీఆర్ రూపొందించారు. తాజాగా 130.28 కిమీలకు పెంచారు. ఈ లైన్ భూసేకరణ ఖర్చు రాష్ట్రమే భరిస్తుంది. కేంద్రం ఆర్థిక లాభాలపై అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ప్రాంతీయ అభివృద్ధి కోసం ముందుకు వచ్చింది. టేకల్‌కోడ్ లైమ్‌స్టోన్ నిక్షేపాలు, సిమెంట్, జౌళి పరిశ్రమలకు ఈ రైల్వేలైన్ దోహదపడుతుంది.

**సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ..**

కొత్త రైల్వే లైన్ నిర్మాణానిక సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన సీఎం ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ధాన్యం, పత్తి, మిర్చి రవాణా, ఎరువుల సరఫరా, గ్రానైట్ ఎగుమతులకు మార్గం సులభతరమవుతుందని, కొత్త పెట్టుబడులు వస్తాయని తెలిపారు. కొత్త రైల్వే లైన్‌తో పరిగి, కొడంగల్, దౌల్తాబాద్, మక్తల్, నారాయణపేటలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఊపందుకుంటాయి. గోవా, హుబ్లీ మార్గాలు దగ్గరవుతాయి. దక్షిణ తెలంగాణ ఆర్థిక దిశను ఇది మలుపు తిప్పుతుందని అంచనా.



# నేటి బాలలే రేపటి పౌరులు

- పోషణ అభియాన్ అద్భుత పథకం
- రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి

**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:**

భద్రాద్రి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారిని జె.స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ప్రతి ఒక్క అంగన్ వాడి కేంద్రం తెరవాలని, తెరిచిన వెంటనే టీచర్, హెల్పర్, లబ్ధిదారుల హాజరు కేంద్ర రాష్ట్ర స్థాయి అప్లికేషన్లు అయినటువంటి పోషణ ట్రాకర్, న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో నమోదు చేయాలని తెలిపారు. వైద్య శాఖ సమన్వయంతో అతి తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం, తక్కువ బరువుతో ఉన్న పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షించి వైద్యుల సూచనల మేరకు న్యూట్రిషన్ రీహబిటేషన్ సెంటర్ కు పంపించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కిశోర బాలికల కోసం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద "ఇందిరమ్మ అమృతం" పేరుతో 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల ఆడపిల్లలకు మిల్లెట్స్ తో కూడిన చిక్కిలు నెల నెల అందజేయడం జరుగుతుందని తద్వారా రక్తహీనత లోపం లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండడమే మన లక్ష్యం అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పౌష్టికాహార పంపిణీలో జాప్యం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎవరైనా గుత్తేదారులు పంపిణీ విషయంలో కానీ నాణ్యత విషయంలో గానీ అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తనదైన శైలిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాశ్వతంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు గాను పెరటి తోట పెంపకాలు (న్యూట్రి గార్డెన్స్) నిర్మించారని దీనిని ఆదర్శంగా తీసుకొని వివిధ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జే.స్వర్ణలత లెనీనా, జిల్లా సిడిపివోలు ప్రసన్న లక్ష్మి, జయలక్ష్మి, తార, అరుణ కుమారి, పద్మశ్రీ, చైతన్య, సలోమి, హేమ సత్య, జ్యోతి, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, జిల్లా కార్యాలయ సిబ్బంది హసీనా, భార్గవి, డి.సి.పి .ఓ హరికుమారి, చైల్డ్ లైన్ సందీప్, జిల్లా పోషణ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రాధాన్యం

- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ముద్ర, ఖమ్మం:**

పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగ విద్యార్థులు అన్ని క్రీడా విభాగాల్లో రాణించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దివ్యాంగ చిన్నారుల రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లా నుండి వివిధ క్రీడా విభాగాలలో ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందానికి సోమవారం కలెక్టర్ లో జిల్లా కలెక్టర్ అభినందించారు. వారి బస్సు ప్రయాణానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని అన్నారు. రాష్ట్రస్థాయి దివ్యాంగ చిన్నారుల ఆటల పోటీలకు ఖమ్మం జిల్లా తరుపున అండర్14, అండర్ 16 విభాగంలో 20 మంది వివిధ పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 17.02.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

### ప్రకృతి ద్వారా

# పరమాత్మ సందేశాలు



**భూమి :** గుండెలో గుచ్చినను భరించి ప్రతిఫలంగా పంటలను, పుష్ప ఫలవృక్షాలను, ప్రసాదిస్తూ, అలానే, మలమూత్రాలను విసర్జించినను, త్రొక్కివేస్తున్నను, ఎంతో నష్టం కష్టం కల్గిస్తున్నను క్షమత్వంతో సహనం గా ఉండడం ద్వారా క్షమత్వమును, ఓర్పునూ, భూతదయను కల్గివుండాలన్న సందేశం "భూమి"ది.

## ఆకాశం:-

వచ్చి పోయే మేఘాల వలన మలినపడకుండా, సూర్యచంద్రులు, నక్షత్రాలు, వాయువు తనతో ఉన్నా, వాటితో ఎలాంటి సంగత్వం ఏర్పరుచుకోకుండా, నిర్మలంగా ఉండడం ద్వారా – మానవుడు కూడా వచ్చే పోయే ఆలోచనలతో అంతఃకరణమును మలినపరుచుకోకుండా స్వచ్ఛంగా ఉండాలని, ఎన్ని బంధాల మధ్య ఉన్నా వాటితో సంగత్వం కల్గియుండక నిర్మలంగా వుండాలన్న సందేశం "ఆకాశము"ది.

## సూర్యుడు

ఒక చిన్న మడుగైనా, పిల్ల కాలువైనా, నదైనా, మహాసముద్రమైనా అన్నింటిలో ఒకేలా ప్రతిబింబిస్తూ, అలానే, నీళ్ళ కుండలలో ప్రతిబింబించి అనేక సూర్యులుగా కన్పించడం ద్వారా మానవుడు సమత్వదృష్టి కల్గియుండాలని, అలానే పరమాత్మ ఒక్కడే అయినా అనేక శరీరములయందు ఆత్మగా గోచరిస్తాడన్న జ్ఞాన సందేశము "సూర్యుడు"ది.

## చంద్రుడు

వెలుగు చీకటిలతో వృద్ధిక్షయాలను పొందడం ద్వారా జీవితంలో సుఖదుఃఖాలు సహజమనే సందేశం "చంద్రుని"ది.

## నీరు

ఎటువంటి మలినాలైనను వాటిని శుద్ధిచేసి తాజాదనమును, నిగారింపును తీసుకురావడం ద్వారా – మానవుడు కూడా మనోమాలిన్యాలను తొలగించుకొని శుద్ధత్వము కల్గియుండాలన్న సందేశం "నీటి"ది.

## అగ్ని

స్థూల మాలిన్యాలని హరింపజేసి, ప్రకాశిస్తూ, కారణ రూపాన్ని విడిచిపెట్టడం ద్వారా – మానవుడు కూడా కర్మపాశాలను హరింపజేసుకొని భక్తిజ్ఞానంలతో ప్రకాశించాలన్న సందేశం "అగ్ని"ది.

## గాలి

అన్నిచోట్ల తిరిగినను, అన్నింటిని స్పృశించినను అన్నింటిని ఎక్కడికక్కడే విడిచిపెట్టేస్తూ, అంతటా ఉన్ననూ ఏదీ అంటించుకోకుండా స్వచ్ఛంగా ఉంటూ, అలానే తను ఉన్నచోట వాతావరణమును చల్లగా, ఉల్లాసంగా ఆహ్లాదంగా మార్చుతూ, అందరిలో జీవాన్ని నింపడం ద్వారా – మానవుడు కూడా అహంకార రహితంగా ఏదీ అంటించుకోకుండా తామరాకుపై నీటిబొట్టులా నిస్సంగుడై జీవించాలని, అలానే ఉన్నచోట అందరిని ఆనందంగా వుంచుతూ, ఉల్లాసంగా జీవించాలనే సందేశం "గాలి"ది.

## నది

తాను ఎక్కడ యున్నదో పట్టించుకోక పర్వతమైన, లోయైనా, వంకలైనా, డొంకలైనా, రాళ్ళరప్పల సందులైనా ఏమాత్రం తేడా లేకుండా ప్రవహిస్తూ, తనకి మూలమైన సముద్రాన్ని చేరేంతవరకు ప్రయాణిస్తూనే వుంటూ, పత్రపుష్పాదులు, చెక్కముక్కలు, చెత్తా చెదారములు, చిరు చిరు ప్రాణులు ప్రవాహంలో తనతోపాటు తీసుకువెళ్తూ, తనలో పాలుపోసినా, చెత్తను పడేసిన సముద్రంలో కలిసేంతవరకు ప్రవహించడమనే తన సహజలక్షణమును వదలకపోవడం ద్వారా – మానవ జీవితం కూడా పరవళ్ళుతో ప్రవహించే తనలాంటిదేనని, ఎన్ని అడ్డులు ఉన్నా వాటిని పట్టించుకోక గమ్యం చేరేంతవరకు గమనమును సాగించాలన్న సందేశం "నది"ది.

## సముద్రం:

అలుపు లేకుండా తీరాన్ని తాకాలని ప్రయత్నించే అలలు ద్వారా, మరియు ఎన్ని నదులు తనలో ప్రవేశించుచున్ననూ పొంగిపోర్లిపోకుండా, అలానే నదులు తనలో చేరక ఎండిపోయినను తాను వట్టిపోకుండ ఉండడం ద్వారా – ఎన్ని సంపదలు తనని చేరుతున్న పొంగిపోక, అలానే ఏ సంపదలు చేరకపోయినా కృంగిపోకుండా హెచ్చుతగ్గుల స్థితి యందు స్థితప్రజ్ఞతో గంభీరుడై, అనుకున్నది సాదించాలనే పట్టుదలతో మానవుడు ఉండాలన్నది "సముద్ర" సందేశం.★

## పక్షులు:

కిలకిలారావాలతో ప్రతిక్షణం ఆనందంగా హాయిగా స్వేచ్ఛగా పరిపూర్ణంగా జీవించడం ద్వారా మానవుడు కూడా ప్రకృతి లోనే ఉంటూ, ఆనందంగా పరిపూర్ణంగా జీవించాలన్న సందేశం "పక్షుల"ది.

## చెట్టు:

తన చెంతకు ఎవరొచ్చినా తరతమ భేదం లేకుండా, హెచ్చుతగ్గుల భేదం లేకుండా వచ్చింది పశుపక్షాదులా, మానవులా అన్న తారతమ్యం లేకుండా నీడను, పండ్లను ఇవ్వడం ద్వారా మానవుడు నిస్వార్ధ సేవాపరుడై ఎలా ఉండాలన్న సందేశం "చెట్టు"ది.

మొక్కపై అలరారుతూ అందంగా వికసించి, తన దగ్గరకు వచ్చిన వాళ్ళందరికీ పరిమళాన్ని ఇచ్చి ఆనందమును కల్గిస్తూ, వాడిపోయక హాయిగా రాలిపోతూ సరళంగా ఉండడం ద్వారా – మానవుడు కూడా అంత ఆదర్శంగానే సరళంగా జ్ఞానవంతంగా జీవించాలన్న సందేశాన్నిస్తుంది "పువ్వు".

కానీ, మానవుడు వీటిని ఎంతవరకు గుర్తిస్తున్నాడు? అన్నీ కాకపోయినా ఇందులో ఒకటైనా జీవితాంతం ఆచరిస్తే చాలని పెద్దల వాక్కు.ప్రకృతి ద్వారా పరమాత్మ సందేశాలు

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా 9848445134

# హస్తానికి హ్యాంగోవర్.. గులాబీకి గండం తప్పిందా?




తెలంగాణ రాజకీయ యవనికపై మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక పెను సంచలనాన్ని సృష్టించాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా మున్సిపాలిటీలను తుడిచిపెట్టేస్తుందని భావించిన రాజకీయ పండితుల అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. ఈ తీర్పు కేవలం గెలుపోటములకు పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో రాబోయే తుఫానుకు సంకేతంగా నిలిచింది. పీఠం దక్కినా పట్టు చిక్కని స్థితిలో కాంగ్రెస్ ఉంటే, అడ్రస్ గల్లంతవుతుందని భావించిన చోట అనూహ్యంగా పుంజుకుని బిఆర్ఎస్ అందరినీ ఆశ్చర్యపరిచింది. వీటన్నింటికీ మించి జాతీయ పార్టీగా ఉప్పెన సృష్టిస్తామన్న బిజెపికి సామాన్య స్వతంత్ర అభ్యర్థులు చుక్కలు చూపించడం ఈ ఎన్నికల హైలైట్ అని చెప్పక తప్పదు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలకు వెలువడిన ఫలితాలను లోతుగా విశ్లేషిస్తే ఓటరు నాడి ప్రధాన పార్టీల అంచనాలకు అందనంత దూరంలో ఉందని స్పష్టమవుతోంది. సాయంత్రం 6 గంటల సమయానికి అందిన అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 2,836 వార్డులలో కాంగ్రెస్ 1,490 స్థానాలు సాధించగా, బిఆర్ఎస్ 759 స్థానాలతో తన బలాన్ని నిరూపించుకుంది. ఇక బిజెపి కేవలం 277 స్థానాలకే పరిమితం కాగా, ఏకంగా 171 వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేసి ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు ఒక రకమైన చేదు అనుభవాన్నే మిగిల్చాయి. సాధారణంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మున్సిపల్ ఎన్నికలంటే అయాచిత వరంగా మారుతాయి. కానీ ఈసారి సీన్ రివర్స్ అయింది. మెజారిటీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, సుమారు 90 మున్సిపాలిటీల్లో పట్టు సాధించి, దాదాపు 12 చోట్ల ఫలితాలు హంగ్ కావడంతో పరేషాన్ లో పడింది. ముఖ్యంగా కీలకమైన నగరపాలక సంస్థల్లో (Corporations) కాంగ్రెస్‌కు ఊహించిన దానికంటే గట్టి పోటీ ఎదురైంది. నల్గొండ, రామగుండం, మంచిర్యాల వంటి కార్పొరేషన్లను హస్తగతం చేసుకున్నప్పటికీ, నిజామాబాద్ వంటి చోట్ల బిజెపి ఆధిక్యం కనబరచడం ఆ పార్టీని ఆశ్చర్యానికి గురిచేసింది. అధికార బలంతో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమాగా ఉన్న నేతలకు ఈ ఫలితాలు గట్టి హెచ్చరికను పంపాయి. ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకత లేదా స్థానిక నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు కాంగ్రెస్ కొంపముంచాయని చెప్పాలి. ఇదే ట్రెండ్ కొనసాగితే రాబోయే జెడ్పిటిసి మరియు ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఊహించిన ఎదురుదెబ్బలు తగిలే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పనులు చేయకపోతే ప్రజలు తిరస్కరిస్తారని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.

మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో 'ఫినిక్స్' పక్షిలా పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కుదేలైన గులాబీ దళం, మున్సిపల్ పోరులో తన ఉనికిని చాటుకోవడమే కాకుండా అధికార పార్టీకి చెమటలు పట్టించింది. గతంలో కంటే సీట్లు తగ్గినప్పటికీ 759 వార్డులను కైవసం చేసుకోవడం ద్వారా తాము ఇంకా రేసులో ఉన్నామని ఆ పార్టీ నిరూపించుకుంది. పట్టణ ఓటర్లు ఇంకా బిఆర్ఎస్ అభివృద్ధి మంత్రానికే మొగ్గు చూపుతున్నారని ఈ ఫలితాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 12 మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీ సాధించడం గమనార్హం. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బిఆర్ఎస్ సక్సెస్ అయిందని, అందుకే కొన్ని కీలక మున్సిపాలిటీల్లో గట్టి ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం గెలుపు మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని చాటిచెప్పే బలమైన సంకేతం. అడ్రస్ గల్లంతవుతుందని భావించిన చోట గులాబీ జెండా రెపరెపలాడటం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

అయితే ఈ ఎన్నికల్లో అసలైన షాక్ తగిలింది మాత్రం బిజెపికే. రాష్ట్రంలో రెండో పెద్ద శక్తిగా అవతరించాలని కలలు గన్న కమల దళానికి ఈ ఫలితాలు మింగుడుపడని సత్యం. జాతీయ స్థాయిలో మోదీ గాలి వీస్తున్నా, రాష్ట్రంలో మాత్రం బిజెపి గ్రాఫ్ పడిపోవడం ఆ పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. విచిత్రమేమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా బిజెపి సాధించిన 277 వార్డులతో పోలిస్తే, స్వతంత్ర అభ్యర్థులు సాధించిన 171 స్థానాలు మరియు ఇతర చిన్న పార్టీల ప్రభావం బిజెపి పతనాన్ని సూచిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పట్టుందని చెప్పుకునే బిజెపికి స్వతంత్ర అభ్యర్థులు షాక్ ఇవ్వడం అంటే పార్టీ క్షేత్రస్థాయిలో ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతోంది. చాలా చోట్ల అభ్యర్థుల ఎంపికలో జరిగిన పొరపాట్లు, గ్రూపు తగాదాలు బిజెపి కొంపముంచాయి. ఫలితంగా బిజెపి శ్రేణుల్లో ఒక రకమైన నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవాల్సిన చోట బిఆర్ఎస్ కంటే వెనుకబడి పోవడం బిజెపికి ఆశలు నీరయ్యేలా చేశాయి.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పరిస్థితి (Hung) నెలకొంది. ఇక్కడ ఇప్పుడు 171 మంది స్వతంత్ర అభ్యర్థులే 'కింగ్ మేకర్లు'గా అవతరించారు. ప్రధాన పార్టీలన్నీ ఇప్పుడు ఈ స్వతంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. క్యాంపు రాజకీయాలు, ప్రలోభాలు ఊపందుకున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలు పార్టీలను కాదని వ్యక్తులను ఎన్నుకున్నారంటే అది వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. సామాన్య ఓటరు పార్టీ గుర్తు కంటే తన గల్లీలో పని చేసే వ్యక్తికే ప్రాధాన్యతనిచ్చాడని ఈ ఫలితాలు ఘోషిస్తున్నాయి. ఇది ప్రధాన పార్టీలకు గట్టి హెచ్చరిక. రాబోయే ఎన్నికల్లోనైనా పార్టీలు తమ తీరు మార్చుకోకపోతే స్వతంత్ర అభ్యర్థుల హవా మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తానికి తెలంగాణ మున్సిపల్ తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపు. ఇది ఒక పార్టీకి గెలుపును, మరో పార్టీకి ఆశను, ఇంకో పార్టీకి నిరాశను మిగిల్చింది. ఈ ప్రభావం ఫిబ్రవరి 16న జరగబోయే మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికపై ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి.

ఈ ఫలితాల విశ్లేషణను బట్టి చూస్తే, ప్రజలు గుడ్డిగా ఏ పార్టీనీ నమ్మడం లేదని, స్థానిక అభివృద్ధి మరియు నాయకత్వానికే పెద్దపీట వేస్తున్నారని అర్థమవుతోంది. కాంగ్రెస్ తన వైఫల్యాలను సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. బిఆర్ఎస్ తన కేడర్‌ను కాపాడుకోవడంలో సక్సెస్ అవ్వగా, బిజెపి మాత్రం తన ఉనికిని చాటుకోవడానికి మరింత కష్టపడాల్సి ఉంది. ఈ మున్సిపల్ సంగ్రామం రాబోయే అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థాయి ఎన్నికలకు ఒక ట్రైలర్ లాంటిది. స్వతంత్రుల గెలుపు అనేది రాజకీయ పార్టీలకు ఒక చరమగీతం వంటిది. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కాని నాయకులను ప్రజలు ఏ పార్టీలో ఉన్నా నిరాకరిస్తారని ఈ ఫలితాలు సందేశాన్నిచ్చాయి. ఫిబ్రవరి 16న జరిగే చైర్మన్ల ఎన్నికల్లో ఈ 171 మంది స్వతంత్రులు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో, ఏ పార్టీ మున్సిపల్ పీఠాలను దక్కించుకుంటుందో చూడాలి. ప్రస్తుతానికైతే తెలంగాణ రాజకీయం రసవత్తరంగా మారింది.

- వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863



# గుడి గోపురాలకు కోట్లు.. బడి గోడలకు చిల్లులు!

## పాలకులారా, ఇది ఏ రకమైన అభివృద్ధి?
## అభివృద్ధి ముసుగులో విద్యా విధ్వంసం

నేటి ఆధునిక భారతదేశంలో అభివృద్ధి అనే పదానికి అర్థం పూర్తిగా మారిపోయింది. ఆకాశహర్మ్యాలు, మెరిసే తారు రోడ్లు, రంగురంగుల వెంచర్లు ఉంటేనే అభివృద్ధి అని పాలకులు భ్రమపడుతున్నారు. కానీ ఈ కాంక్రీట్ వనాల మధ్య జాతి భవిష్యత్తును నిర్మించే 'అక్షరం' మాత్రం అనాథగా మారుతోంది. ఒకవైపు దేశం ప్రపంచ స్థాయికి వెళ్తుందని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు, మరోవైపు సామాన్యుడికి అందాల్సిన కనీస విద్యా హక్కును కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. గల్లీకి ఒక గుడి, వెంచర్‌కు ఒక పార్కు వెలుస్తున్నాయి కానీ, వందలాది కుటుంబాలు నివసించే చోట ఒక ప్రభుత్వ బడి జాడ లేకపోవడం ఈ ప్రజాస్వామ్య వ్యవస్థకే పట్టిన గ్రహణం. విజ్ఞానం కంటే వినోదానికి, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్న తీరు చూస్తుంటే దేశం ఎటు వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.




## గుళ్ళు గోపురాల ఆర్భాటం – బడుల నిర్వేదం

ప్రభుత్వాలకు ఆధ్యాత్మికత మీద ఉన్న శ్రద్ధ అక్షరం మీద లేకపోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. ఆధ్యాత్మికత అనేది మనిషి అంతర్గత శాంతి కోసం ఉండాలి, కానీ అది విద్యా హక్కును మింగేసే స్థాయికి చేరకూడదు. నేడు వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గుళ్ళు, గోపురాల నిర్మాణానికి, వాటి పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్న పాలకులు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పట్టించుకోవడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒక ఆలయాన్ని నిర్మిస్తే అది ఒక వర్గానికో లేదా ఒక ప్రాంతానికో పరిమితం కావచ్చు, కానీ ఒక పాఠశాలను నిర్మిస్తే అది తరతరాల అజ్ఞానాన్ని రూపుమాపి, దేశాభివృద్ధికి బలమైన బాటలు వేస్తుంది. గుడి కంటే బడి మిన్న అన్న విజ్ఞుల మాటలను తుంగలో తొక్కి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే భక్తిని వాడుకుంటున్న తీరు గర్హనీయం. గోపురాలు ఎత్తుగా పెరుగుతున్నా, పేదవాడి చదువు మాత్రం పాతాళానికి పడిపోతోంది.

## వెంచర్ల వెల్లువలో విస్మరణకు గురవుతున్న విద్య

రియల్ ఎస్టేట్ వ్యాపారం నేడు ఒక మాఫియాలా విస్తరిస్తోంది. అపార్ట్‌మెంట్లు, భారీ వెంచర్లు వెలుస్తున్నప్పుడు ప్రభుత్వం సులభంగా లేఅవుట్ అనుమతులు ఇస్తోంది. ఆ నిబంధనల ప్రకారం ఓపెన్ స్పేస్‌లో పార్కులు ఉండాలి, సామాజిక భవనాలు ఉండాలి. కానీ, ఎక్కడైనా ఒక ప్రభుత్వ పాఠశాల కోసం స్థలాన్ని కేటాయించాలనే నిబంధనను ప్రభుత్వం గట్టిగా అమలు చేయడం లేదు. జనాభా లెక్కల ప్రకారం ప్రతి రెండు వేల మందికి ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలనే చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది. వందల ఎకరాల్లో వెంచర్లు వేస్తున్న వారు పార్కులు మరియు గుళ్ళు కట్టి, చదువు కోనే శక్తి లేని పేదలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీనివల్ల మధ్యతరగతి మరియు పేద ప్రజలు తమ రక్తాన్ని అమ్ముకొని కార్పొరేట్ స్కూళ్లలో లక్షలాది రూపాయల ఫీజులు కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కు కావడం వల్లే సామాన్యుడికి ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారుతోంది.

## ప్రైవేటీకరణ కుట్ర – పాలకుల వైఫల్యం

ప్రభుత్వ పాఠశాలలు లేని చోట సహజంగానే ప్రైవేట్ విద్యాసంస్థలు రాజ్యమేలుతాయి. ఇది ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న వ్యవస్థీకృత కుట్రగా భావించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ పెట్టుబడిదారులకు ఎర్రటి కార్పెట్ పరుస్తోంది. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలలో ప్రభుత్వ బడులు నిర్మించకపోవడం, ఉన్న బడుల్లో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడం వల్ల విద్యార్థులు ప్రైవేట్ జైళ్లలోకి నెట్టబడుతున్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాల్సిన బాధ్యతను పాలకులు పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ప్రపంచ అక్షరాస్యత రేటులో భారతదేశం వెనుకబడిపోవడమే కాకుండా, విద్య అనేది కేవలం ధనవంతులకు మాత్రమే దక్కే విలాసంగా మారుతోంది. ఇది సమాజంలో మేధోపరమైన అసమానతలకు దారితీస్తోంది.

## కేరళ నమూనా – ఒక మౌన సవాల్

దేశంలో అక్షరాస్యతలో కేరళ అగ్రస్థానంలో నిలవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రభుత్వం విద్యకు ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యత. వారు గుళ్ళు, గోపురాల కంటే బడిని పవిత్రంగా భావించారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు నాణ్యమైన విద్యా సౌకర్యాలను ఉచితంగా అందించడం వల్ల అక్కడ సమాజం విజ్ఞానవంతంగా తయారైంది. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ సంస్థలకు సవాల్ విసిరేలా అభివృద్ధి చెందాయి. మరి కేరళలో సాధ్యమైనది మిగిలిన రాష్ట్రాల్లో ఎందుకు సాధ్యం కావడం లేదనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. పాలకులకు ప్రశ్నించే గొంతుకల కంటే, మూఢనమ్మకాల్లో మునిగిపోయే అంధులే కావాలని ప్రస్తుత రాజకీయ పోకడలు స్పష్టం చేస్తున్నాయి. విద్యపై పెట్టే పెట్టుబడిని వృధాగా భావించడం పాలకుల అవివేకానికి నిదర్శనం.

## అయోమయంలో భవిష్యత్తు – గందరగోళం

చివరికి మనం ఎటు వైపు ప్రయాణిస్తున్నాం అనే విషయంలో ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. అపార్ట్‌మెంట్లు పెరగడం, వెంచర్లు రావడం అభివృద్ధికి సూచికే కావచ్చు, కానీ అక్కడ జ్ఞానాన్ని పంచే బడి లేకపోవడం వినాశనానికి సంకేతం అని గుర్తించలేకపోతున్నాం. పార్కులో ఆడుకోవడానికి స్థలం ఉంది, గుడిలో మొక్కుకోవడానికి స్థలం ఉంది, కానీ చదువుకోవడానికి మాత్రం ప్రభుత్వ బడి లేదు. ఇది ప్రభుత్వ వైఫల్యమా లేక ప్రైవేట్ శక్తుల విజయమా అనే అయోమయం నెలకొంది. ఒకవైపు డిజిటల్ విప్లవం గురించి, టెక్నాలజీ గురించి మాట్లాడుతుంటే, మరోవైపు పేద పిల్లవాడు బడికి దూరమవుతున్నాడన్న నిజాన్ని మనం ఎలా అంగీకరించాలి? ఈ అయోమయ స్థితి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశంలో అక్షరాస్యత గ్రాఫ్ పడిపోవడమే కాకుండా, సమాజం విజ్ఞాన రహితంగా మారే ప్రమాదం ఉంది. మేధస్సు లేని జనాభా దేశానికి ఆస్తి కాదు, భారంగా మారుతుంది.

## మన పాలకులకు హెచ్చరిక!

అక్షరం ఆగిపోతే దేశం ఆగిపోతుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి, గుళ్ళు గోపురాల కంటే ముందు బడులను, ఉపాధ్యాయ నియామకాలను అత్యవసర ప్రాధాన్యతగా తీసుకోవాలి. వెంచర్ అనుమతులలో పాఠశాల స్థలాన్ని తప్పనిసరి చేయాలి. సామాన్యుడికి ఉచిత విద్యను అందించని ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటుంది? ఇప్పటికైనా పాలకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోకపోతే, అక్షరాస్యతలో వెనుకబడిన దేశంగా భారతదేశం చరిత్రలో మిగిలిపోతుంది. రాబోయే తరాలు తమ చదువును తాకట్టు పెట్టిన పాలకులను ఎన్నటికీ క్షమించవు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో
టాప్ 3 కారు
హ్యుందాయ్ క్రెటా ప్రీమియం ఫీచర్స్, స్టైలిష్ డిజైన్‌తో SUV సెగ్మెంట్‌లో టాప్.
స్మూత్ డ్రైవింగ్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది.






చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి



వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ గా గుర్రకొండ మధుసూదన్ గౌడ్

## వనపర్తి మున్సిపాలిటీలో ఏకగ్రీవ ఎన్నికలు

- **చైర్ పర్సన్ గా మిడిదొడ్డి మాధవి, వైస్ చైర్మన్‌గా మధుసూదన్ గౌడ్**

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ చైర్ పర్సన్ గా మిడిదొడ్డి మాధవి, వైస్ చైర్మన్‌గా మధుసూదన్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశమై, ఎన్నికల అధికారి అయిన ఆర్డీవో సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చైర్ పర్సన్ గా మిడిదొడ్డి మాధవిని కౌన్సిలర్ పరశురాం ప్రతిపాదించగా, వైస్ చైర్మన్‌గా మధుసూదన్ గౌడ్‌ను కౌన్సిలర్ బి.వెంకటేష్ ప్రతిపాదించారు. ఈ పదవులకు మరెవ్వరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం వారికి ప్రమాణ స్వీకారం చేయించారు.

## రెండు గంటల కౌన్సిలర్

- **ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే పదవికి రాజీనామా**
- **చైర్మన్ ఎంపికలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపణ**

**ముద్ర, వనపర్తి :**



మున్సిపాలిటీలో ప్రమాణ స్వీకారం చేసిన రెండు గంటలకే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. మూడో వార్డు నుంచి ఎన్నికైన కౌన్సిలర్ చీర్ల రజిని తన రాజీనామాను ప్రకటిస్తూ ఎన్నికల అధికారి, ఆర్డీవోకు లిఖిత పూర్వకంగా సమర్పించారు. మున్సిపల్ చైర్మన్‌గా మాధవి ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. చైర్మన్ ఎన్నికలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కౌన్సిల్‌లో అనుభవం లేని వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టి, అధినేతలు రాజకీయ ప్రయోజనాల కోసం పావుగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. తమ కుటుంబం ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడినా తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో అత్యధిక మంది సభ్యులు బీసీలే ఉన్నప్పటికీ చైర్మన్ పదవి ఆ వర్గానికి దక్కకపోవడం బాధాకరమన్నారు. దీనికి నిరసనగా కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

## కాప్రాలో మౌలిక సదుపాయాలకు చర్యలు : ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**



కాప్రా డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రవీణ్ ఎన్‌క్లేవ్‌లో రూ. 35లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, కాలనీ అధ్యక్షురాలు లత, కార్యదర్శి మహేష్, రాఘవేందర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కమిషనర్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే..**

మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## పేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా కొండా శ్వేతా సత్య యాదవ్

- **వైస్ చైర్ పర్సన్ గా మంజుల రాఘవేందర్ రెడ్డి**

**ముద్ర, నారాయణపేట :**



ఎట్టకేలకు నారాయణపేట మున్సిపాలిటీ బిజెపి కైవసం చేసుకుంది. సోమవారం ఉదయం కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆర్డిఓ రామచందర్ రావు ఆధ్వర్యంలో కొనసాగించారు. బిజెపి చైర్పర్సన్ గా కొండ శ్వేత సత్య యాదవ్ కు(ఎక్స్ అఫీషియో) ఎంపీ డీకే అరుణ ఓటుతో కలిపి 13మంది మద్దతు లభించడంతో చైర్పర్సన్ గా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్పర్సన్ గా మంజుల రాఘవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి హాజరై తమ తమ పార్టీ అభ్యర్థుల ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ల ఎన్నికలో బిజెపి విజయం సాధించడంతో జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ఎన్నికల నిబంధనలకు లోబడి సంబరాలు జరుపుకున్నారు. నూతన చైర్పర్సన్ కొండా శ్వేతా సత్యా యాదవ్ చైర్పర్సన్ గా ఎన్నికైన వెంటనే నేరుగా బిజెపి సీనియర్ నాయకులు నాగురావు నామాజీ ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సమయంలో సత్య యాదవ్ భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యతమయ్యారు.

# డంకా భజాయించిన కాంగ్రెస్..!

- **మహబూబ్ నగర్ మేయర్ పీఠంపై ముదిరాజ్ ఆడబిడ్డ**
- **ఆశావహులకు ఝలక్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం**
- **ముదిరాజ్ లకే ఇవ్వాలని చక్రం తిప్పిన ఎమ్మెల్యే యెన్నం, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**
- **ఎవరూ ఊహించని కార్పొరేటర్ కు దక్కిన మేయర్ పదవి**
- **సీనియర్ నేత సురేందర్ రెడ్డి కి దక్కిన డిప్యూటీ మేయర్ పీఠం**
- **పలు మున్సిపాలిటీ లలో ఎక్స్ అఫిషియో ఓటుతో చైర్మన్ పీఠం కైవసం**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



మహబూబ్ నగర్ మేయర్ గుమాల్ మమత



మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి

ఊహించని మలుపులు.. ఊహకందని ఎంపిక.. రెండు రోజులుగా ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లతో సాగిన మహబూబ్ నగర్ మేయర్ ఎన్నిక. ఎట్టకేలకు ఎవరూ ఊహించని కార్పొరేటర్ కు దక్కిన మేయర్ పీఠం. ఎంతో ఉత్కంఠ నెలకొన్నా చివరికి ముదిరాజ్ ఆడబిడ్డకు మేయర్ పదవి లభించింది. దీంతో ఇంతకాలం మేయర్ పీఠంపై ఆశ పెట్టుకున్న వారు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. రాత్రి దాకా పదవి వస్తుందని ఆశించిన అభ్యర్థులకు పొద్దెక్కగానే సీన్ రివర్స్ అయింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ రాత్రికి రాత్రే చక్రం తిప్పి ఆశావహులకు ఝలక్ ఇచ్చారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ లోని 3 డివిజన్ కు చెందిన గుమాల్ మమతనూ మేయర్ గా ఎంపిక చేశారు. ఉద్రిక్తల మధ్య మేయర్ ఎంపిక ఏకగ్రీవమైంది. 11 డివిజన్ నుంచి కార్పొరేటర్ గా ఎన్నికైన మారెపల్లి సురేందర్ రెడ్డికి డిప్యూటీ మేయర్ పదవి దక్కింది. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితునిగా ఉన్న సురేందర్ రెడ్డి డిప్యూటీగా ఎన్నిక లాంచనమైంది. ఇది అందరూ అనుకున్న విధంగానే ఎంపిక జరిగింది. కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చిన మైనార్టీలు, స్వతంత్రులు డిప్యూటీ మేయర్ పదవి ఆశించినా ఫలితం దక్కలేదు. వారికి ఇతర పదవుల్లో ప్రాధాన్యం కలిపిస్తామని పార్టీ అభయం ఇచ్చినట్లు సమాచారం. ఏదిఏమైనా ఎమ్మెల్యే యెన్నం తన మార్క్ రాజకీయాన్ని మేయర్ ఎంపికలో కనపడింది. మేయర్ పదవి మొదటి నుంచి ఆశించిన ఆనంద్ గౌడ్ ను పూర్తిగా కట్టడి చేశారు. ఆయన తన భార్యకు మేయర్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో శంషాబాద్ రిసార్ట్ లో తీవ్ర గొడవ జరిగింది. వెంటనే పోలీసులు ఆనంద్ గౌడ్ ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆయనకు నచ్చజెప్పి గొడవ చేస్తే మీకే నష్టం జరుగుతుందని, ఇతర పదవుల్లో తప్పకుండ స్థానం కలిపిస్తామని భరోసా ఇవ్వడంతో ఆయన మౌనంగా ఉండిపోయారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వెంట క్యాంపు నుంచి నేరుగా మున్సిపాలిటీ కార్యాలయానికి ఆనంద్ గౌడ్ వచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు ఎలాంటి గొడవలు లేకుండానే ప్రశాంతంగా మేయర్ ఎన్నిక జరిగింది. తొలి మేయర్ పీఠం ముదిరాజ్ లకు దక్కడం తో ఆ వర్గాలు సంబరాల్లో మునిగితేలుతున్నాయి. ముదిరాజ్ ఆడబిడ్డను తొలి మేయర్ గా ఎంపిక చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలకు ముదిరాజ్ సంఘం కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

**గద్వాల లో కాంగ్రెస్సే కింగ్..**

గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలు రసవత్తరంగా ముగిశాయి. చివరి వరకు దోబూచులాడిన విజయం కాంగ్రెస్ పార్టీకే దక్కింది. ఇక్కడ కాంగ్రెస్ చైర్మన్ పీఠం దక్కాలంటే ఒకే అభ్యర్థి అవసరం ఉండేది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకుంటే చైర్మన్ పదవి కాంగ్రెస్ కే వస్తుంది. కానీ ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నానంటూ ఇది వరకే ప్రకటించారు. కానీ కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులకు రక్షణ కవచంగా పనిచేశారు. చివరకు ఎంపీ మల్లు రవి తన ఎక్స్ అఫిషియో ఓటును ఆమన్‌గల్ నుంచి గద్వాల కు మార్చుకున్నారు. దీంతో ఆయన తన ఓటును గద్వాల మున్సిపాలిటీలో ఉపయోగించుకున్నారు. ఎంపీ ఓటుతో కాంగ్రెస్ కు మేజిక్ ఫిగర్ దాటడంతో చైర్మన్ పదవి కాంగ్రెస్ కు దక్కింది. అలంపూర్లో కాంగ్రెస్ పార్టీకి 5, బీఆర్ఎస్ కు 5 రావడంతో ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు తన ఎక్స్ అఫిషియో ఓటుతో బీఆర్ఎస్ మేజిక్ ఫిగర్ దాటడంతో చైర్మన్ పదవి దక్కింది. నారాయణ పేటలో బీజేపీ ఎంపీ డీకే అరుణ ఎక్స్ అఫిషియో ఓటు తో బీజేపీ చైర్మన్ పీఠం పొందింది. అమరచింత లో కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్ కు చైర్మన్ పదవి వరించింది. ఇక్కడ కూడా మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి ఎక్స్ అఫిషియో ఓటుతో చైర్మన్ పదవి కాంగ్రెస్ వశం అయింది. వనపర్తి మున్సిపాలిటీ లో చైర్ పర్సన్ పదవి ఆశించి భంగపడిన చీర్ల రజని తన కౌన్సిలర్ పదవికి, కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేశారు. ఈమె వనపర్తి లోని మూడవ వార్డు నుంచి కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. కొల్లాపూర్, నాగర్ కర్నూల్, భూత్పూర్, దేవరకద్ర, కొడంగల్, మద్దూర్, కోస్గి, కొత్తకోట, మక్తల్ మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ అభ్యర్థులు చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం తో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పట్టు నిలుపుకుంది. ఒకప్పుడు కాంగ్రెస్ కు కాంచుకోటగా ఉన్న ఉమ్మడి జిల్లా లో మళ్ళీ పూర్వ వైభవం వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం తో ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యే లు మున్సిపాలిటీ ఎన్నికలను సవాల్ గా తీసుకుని సఫలం చెందారు.

## మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ల వివరాలు :

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్ నగర్ : (కాంగ్రెస్)
మేయర్ : గుమా ల మమత
డిప్యూటీ మేయర్ : సురేందర్ రెడ్డి

వనపర్తి : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : మాధవి
వైస్ చైర్మన్ : మధుసూదన్ గౌడ్

గద్వాల : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : తుమ్మల జయశ్రీ
వైస్ చైర్మన్ : శంకర్

అమరచింత : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : సువర్ణ
వైస్ చైర్ పర్సన్ : రాధ

నారాయణ పేట : (బీజేపీ)
చైర్ పర్సన్ : కొండా శ్వేత
వైస్ చైర్ పర్సన్ : మంజుల రెడ్డి

అలంపూర్ : (బీ ఆర్ ఎస్)
చైర్మన్ : జయరాములు
వైస్ చైర్మన్ : విక్రమ్

దేవరకద్ర : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : దమయంతి
వైస్ చైర్మన్ : యుగంధర్ రెడ్డి

మక్తల్ : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : వాకిటి మానస
వైస్ చైర్ పర్సన్ : శైవిరెడ్డి

ఆత్మకూరు : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : నాగమణి
వైస్ చైర్మన్ : శ్రీనివాసులు

నాగర్ కర్నూల్ : (కాంగ్రెస్)
చైర్మన్ : తీగల సురేంద్ర
వైస్ చైర్మన్ : బాదం రమేష్

భూత్పూర్ : (కాంగ్రెస్)
చైర్మన్ : మూడవత్ బాలోటి
వైస్ చైర్ పర్సన్ : లిక్క సూర్యకళ

కొల్లాపూర్ : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : రెడ్డి జ్యోతి
వైస్ చైర్మన్ : షేక్ రహీం పాషా

మద్దూర్ : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : సరస్వతి
వైస్ చైర్ పర్సన్ : భాగ్యశ్రీ

కోస్గి : (కాంగ్రెస్)
చైర్మన్ : నరేందర్
వైస్ చైర్ పర్సన్ : చింతల సరిత

కొత్తకోట : (కాంగ్రెస్)
చైర్ పర్సన్ : అరుణ
వైస్ చైర్ పర్సన్ : పల్లవి

పెబ్బేరు : (కాంగ్రెస్)
చైర్మన్ : శ్రీనివాస్ గౌడ్
వైస్ చైర్ పర్సన్ : సుమిత్ర

కొడంగల్ : కాంగ్రెస్
చైర్మన్ : నందారం ప్రశాంత్
వైస్ చైర్మన్ : శంకర్ నాయక్

వడ్డేపల్లి : ఫార్వర్డ్ బ్లాక్
చైర్ పర్సన్ : మంజుల
వైస్ చైర్ పర్సన్ : శరంద

ఐజ : (బీఆర్ఎస్)
చైర్మన్ : సురేష్
వైస్ చైర్మన్ : నర్సిములు

## మున్సిపాలిటీలో ఏకగ్రీవ ఎన్నికలు

- **చైర్‌పర్సన్‌గా పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా అబ్దుల్ రజాక్**

**ముద్ర, తాండూరు :**



ఉత్కంఠ రేపిన వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రత్యేక సమావేశంలో పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి చైర్‌పర్సన్‌గా, అబ్దుల్ రజాక్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం కౌన్సిలర్లలో 19 మంది (కాంగ్రెస్) సభ్యులు హాజరుకావడంతో ఎన్నిక నిర్వహణకు అవసరమైన కోరం లభించింది. దీంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. చైర్‌పర్సన్ పదవికి పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి పేరును, వైస్ చైర్మన్ పదవికి అబ్దుల్ రజాక్ పేరును సభ్యులు ప్రతిపాదించారు. ఇతర పోటీదారులు లేకపోవడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారికంగా వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్ పదవీ ప్రమాణస్వీకారం చేయించి ధ్రువపత్రాలు అందజేశారు. పట్లోళ్ల నీరజ 12వ వార్డు సభ్యురాలిగా, అబ్దుల్ రజాక్ 29వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే. చైర్‌పర్సన్‌గా నీరజ బాల్‌రెడ్డిని కౌన్సిలర్ అబ్దుల్ రజాక్ ప్రతిపాదించగా, 22వ వార్డు కౌన్సిలర్ మనపురం రామకృష్ణ బలపరిచారు. వైస్ చైర్మన్‌గా అబ్దుల్ రజాక్‌ను వేణుగోపాల్ ప్రతిపాదించగా, జుంటిపల్లి వెంకటేష్ బలపరిచారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కౌన్సిలర్లు, అధికారులతో సమన్వయంగా పనిచేస్తామని చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులు, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎక్స్‌ఆఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'నిరుపేదలకు అండగా ఉంటా'

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ మున్సిపల్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటయ్య సతీమణి అకాల మరణం చెందింది. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 7వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షద్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులోని నిరుపేద కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా తనకు తోచినంత సహాయం చేస్తూ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఆయన అందించిన సహాయానికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17-02-2026
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 4 కారు
మారుతి బాలెనో
ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌గా మంచి స్పేస్, కంఫర్ట్.
మంచి మైలేజ్, తక్కువ ఖర్చుతో మెయింటెనెన్స్.



# సామాన్యుడికే మేయర్ పీఠం

**- మేయర్ గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గా సునీల్ రావు -**
**- ఖరారు చేసిన బీజేపీ నాయకత్వం.. ఏకగ్రీవంగా ఆమోదించిన పార్టీ కార్పొరేటర్లు**

**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి సామాన్యుడికే దక్కింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థి గా 2వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావును ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఈ మేరకు వారి పేర్లను ఖరారు చేస్తూ లేఖ విడుదల చేశారు.

ఈ నేపథ్యంలో నగరంలోని వి.కన్వెన్షన్ లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా బీజేపీ కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి లేఖను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల సమక్షంలో డాక్టర్ మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను కార్పొరేటర్లకు తెలియజేసి వారి అభిప్రాయాలను కోరారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. అట్లాగే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. బీజేపీ సీనియర్ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, వాసాల రమేశ్ సహా బీజేపీ కార్పొరేటర్లందరూ కొలగాని శ్రీనివాస్, సునీల్ రావు పేర్లను మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక బస్సులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు విచ్చేసిన కార్పొరేటర్లంతా ప్రమాణ స్వీకారం చేశారు.

**వడబోసిన హైకమాండ్**

వాస్తవానికి కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ కార్పొరేటర్లంతా ఆశలు పెట్టుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా నాయకత్వం బీసీ, జనరల్ స్థానాల్లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్ల పేర్లను, వారి బయోడేటాను రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఆ జాబితాలో ఉన్న ఒక్కో కార్పొరేటర్ పేరును, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పేరును పరిశీలించింది. చివరకు ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్త కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.





**రామచంద్రరావుకు బండి సంజయ్ ధన్యవాదాలు**

కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేయడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం అందించిన సహకారం, లీగల్ సాయం ఎనలేనిదని పేర్కొన్నారు.

## శ్రీనివాస్ కు ఊహించని వరం

సోమవారం ఉదయం బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో పార్టీ జిల్లా ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిందని తెలియజేయడంతో కొలగాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్పొరేటర్లంతా వచ్చి కొలగానికి అభినందనలు తెలియజేస్తున్న సమయంలోనూ ఆశ్చర్యం, ఆనందంతో చెమర్చిన కళ్లతో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తనైన తనను మేయర్ కు ఎంపిక చేస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు.

37 ఏళ్ల కొలగాని శ్రీనివాస్ 1989 జూన్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించారు. ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ చేసిన కొలగాని చిన్నప్పటి నుండే ఆర్ఎస్ఎస్ లో శాఖలో చురుకుగా పాల్గొనే వారు. 2013లోనే ప్రాథమిక శిక్షను పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే స్వామి వివేకానంద ఆలోచనలతో ప్రభావితమై ఎన్ఎస్ఎస్, ఎన్ వైపీ, ఏక్తా పరిషత్ సంస్థల ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేది. 2005 నుండి 2007 వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. 2007 నుండి 2009 వరకు భారతీయ జనతా యువ మోర్చాలో పనిచేసి యువజన పోరాటాల్లోనూ పాలు పంచుకున్నారు. 2007 నుండి 2009 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేసి 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు చేరి దేశ సేవకు అంకితం కావాలని భావించిన కొలగాని 2009లో అసోంలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ పీస్ క్యాంప్ నకు హాజరయ్యారు. లక్షద్వీప్,బెంగళూరు, యూపీ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ లలో నిర్వహించిన అనేక జాతీయ స్థాయి శిబిరాల్లోనూ పాల్గొన్నారు. యువత, పిల్లలతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనే వారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు. 2009 నుండి 2013లో ఏక్తా పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు. కొలగాని సేవలకు గాను 2005 లో భాయిజీ సేవా పురస్కార్ (NYP), 2010లో NSS ఉత్తమ వలంటీర్, 2021–కరోనా కాలంలో అందించిన సేవలకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా 'రక్షక్ అవార్డు'లను అందుకున్నారు.

**రాజకీయ ప్రస్థానం..**

2014 నుండి 2019 వరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుండి 2025 వరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ గా కొనసాగారు. 2021లో కరోనా వ్యాక్సిన్ జిల్లా కన్వీనర్ గా, 2023 నుండి 2024 వరకు కరీంనగర్ టౌన్–1 కన్వీనర్ గా, 2024 లో NIFFA రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025లో చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్ గా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

---

పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే

## ధర్మపురిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక

**హామీలు నెరవేర్చిన తర్వాతే విజయోత్సవాలు: మంత్రి అడ్లూరి**



**ముద్ర, ధర్మపురి:**
ధర్మపురి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచన మేరకు జరిగినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సోమవారం ధర్మపురి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి ప్రజలు తనపై విశ్వాసంతో 15 వార్డుల్లో 15 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని అన్నారు. 2009 నుండి గెలిచినా ఓడినా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అయ్యానని తెలిపారు.

ధర్మపురి మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ఇద్దరు అభ్యర్థులు సంఘనభట్ల దినేష్ సంతోషి, వేముల నాగలక్ష్మి లు పోటీ పడగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ ల నిర్ణయంతో వేముల నాగలక్ష్మిని మున్సిపల్ చైర్మన్ గా ఇందారపు రామన్నను వైస్ చైర్మన్ గా ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. మొదటి రెండు సంవత్సరాలు ధర్మపురి మున్సిపల్ చైర్మన్ గా నాగలక్ష్మి, తర్వాతి మూడు సంవత్సరాలు సంఘనభట్ల సంతోషిని చైర్మన్ పదవిలో కొనసాగుతారని మంత్రి వివరించారు. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం పోటీ పడిన సంఘనభట్ల దినేష్ సంతోషికి త్వరలోనే రాష్ట్రస్థాయి పదవి ఇచ్చి గౌరవాన్ని కాపాడతానని హామీ ఇచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా పట్టణంలో ఎలాంటి విజయోత్సవాలు నిర్వహించమని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 60 రోజుల్లో నెరవేర్చిన అనంతరం విజయోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు వారి వార్డులలో ఓటర్లను కలిసి కృతజ్ఞతలు తెలుపాలని మంత్రి సూచించారు.

---

అందరి సహకారంతో

## నిర్మల్ అభివృద్ధికి కృషి

**చైర్ పర్సన్ అప్పాల కావ్య**





**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో నిర్మల్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని నిర్మల్ నూతన మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో 42 వార్డుల నుండి గెలుపొందిన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గా అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గా అప్పాల గణేష్ చక్రవర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ నిర్మల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానని అన్నారు. పట్టణంలోని 42 వార్డులలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. తనకు పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు.

నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గా ఎన్నికైన అప్పాల గణేష్ చక్రవర్తిని పలువురు ప్రముఖులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి వేణుగోపాల చారి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ తదితరులు అభినందించారు.

**భార్యాభర్తలే చైర్మన్, వైస్ చైర్మన్**

నిర్మల్ మున్సిపల్ చరిత్ర తిరగరాశారు. ఎన్నడూ లేని విధంగా భార్య, భర్తలే చైర్మన్, వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న అప్పాల కుటుంబం ఆది నుండి నిర్మల్ మున్సిపాలిటీపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తోంది. తాత నుండి మనవడి వరకు మున్సిపాలిటీ చైర్మన్లుగా ఆ కుటుంబం నుండి పనిచేసిన వారే. తాజాగా సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అప్పాల కావ్య, అప్పాల గణేష్ చక్రవర్తులు చైర్మన్, వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు.

---

## సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ



**ముద్ర, సిరిసిల్ల:**
సిరిసిల్ల మున్సిపల్ లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ నుంచి రెండోసారి జిందం కళ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ యువనేత దార్ల సందీప్ కు వైస్ చైర్మన్ గా అవకాశం దక్కింది. వరుసగా రెండోసారి సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన జిందం కళ చక్రపాణికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు సహకారంతో సిరిసిల్ల మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరవేశామని, ఇదే స్ఫూర్తితో పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని చైర్ పర్సన్ జిందం కళ తెలిపారు.

---

కరీంనగర్ పాలక మండలికి

## బండి సంజయ్ శుభాకాంక్షలు




**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్, డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్, వై సునీల్ రావు, కార్పొరేటర్లకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుష్పగుచ్ఛాలు అంద జేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారికి సంజయ్ శుభాకాంక్షలు తెలిపి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అభివృద్ధి బాటలో సాగాలన్నారు.

---

## కాంగ్రెస్ పార్టీకే మంచిర్యాల పీఠం..

**- ఆదిలాబాద్ ఛైర్‌పర్సన్‌గా బండారి అనూష.. - భైంసా ఛైర్‌పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థి తూమొల్ల దత్తాద్రి**



ఆదిలాబాద్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్



భైంసా ఛైర్మన్ దత్తాద్రి

**ముద్ర, ఆదిలాబాద్:**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. తొలి మేయర్‌గా ధర్ని మధు, డిప్యూటీ మేయర్‌గా రమ్య ఎన్నికయ్యారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీర్ఎస్, ఎంఐఎం, స్వతంత్రుల మద్దతుతో ఛైర్‌పర్సన్‌గా బండారి అనూష, వైస్ ఛైర్ పర్సన్‌గా మహ్మద్ రోహిత్ ఎన్నికయ్యారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా మెంగ్రే ఆకాశ్, వైస్ ఛైర్‌పర్సన్‌గా అహ్మద్ ఎన్నికయ్యారు.

నిర్మల్ జిల్లాలోని భైంసా మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోయాయి. పార్టీల బలాబలాలను తలకిందులు చేస్తూ భైంసా మున్సిపల్ పీఠాన్ని స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ గా ఇండిపెండెంట్ అభ్యర్థి తూమొల్ల దత్తాద్రి, వైస్ ఛైర్ పర్సన్ గా మరో ఇండిపెండెంట్ అభ్యర్థి బిబి కుతిజ సిద్ధికి ఎన్నికయ్యారు.

నిర్మల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. భార్యాభర్తలు అప్పాల కావ్య, అప్పాల గణేశ్ చక్రవర్తి ఛైర్‌పర్సన్, ఉప ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దొంత అంజలీ దేవి, వైస్ ఛైర్‌పర్సన్‌గా మోత్కూరి రాజేశ్వరి ఎన్నికయ్యారు. చెన్నూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. ఛైర్‌పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ ఛైర్‌పర్సన్‌గా నాయకపు వినయ్ ఎన్నికయ్యారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. ఛైర్మన్‌గా దావ స్వాతి, వైస్ ఛైర్మన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖానాపూర్, కాగజ్‌నగర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం ఒక కార్పొరేషన్, 10 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి.

---

## జగిత్యాల చైర్ పర్సన్ గా సమిండ్ల వాణి



**ముద్ర, జగిత్యాల:**
నాటకీయ పరిణామాల మధ్య జగిత్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ పీఠం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికే దక్కింది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ గా సమిండ్ల వాణి ఎన్నికయ్యారు. మొదటి నుంచి చైర్‌పర్సన్ సీటు పై పట్టుదలగా ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గానికి ఈసారి కూడా నిరాశే ఎదురైంది. అయితే వైస్ చైర్మన్ పదవి మాత్రం జీవన్ రెడ్డి వర్గానికి దక్కింది. జీనత్ ఫర్విన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 50 వార్డులున్న జగిత్యాల మున్సిపాలిటీలో 23 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అదనంగా బీజేపీ రెబల్ కౌన్సిలర్లు ముగ్గురు, ఎంఐఎం ఇద్దరు, ఇండిపెండెంట్లు కలిసి మొత్తం 39 మంది కౌన్సిలర్లు సమిండ్ల వాణికి మద్దతు ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్ పదవి స్పష్టమైన మెజారిటీతో ఎమ్మెల్యే వర్గానికి దక్కింది. ఇక బీజేపీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు సభ్యులు, కాంగ్రెస్ కౌన్సిలర్ అడువాల జ్యోతి తటస్థంగా ఉన్నారు. వివాదాస్పదంగా మారిన జగిత్యాల మున్సిపల్ వ్యవహారంలో చివరకు చైర్‌పర్సన్ పదవి ఎమ్మెల్యే వర్గానికి, వైస్ చైర్మన్ పదవి జీవన్ రెడ్డి వర్గానికి దక్కడంతో అంతర్గత వర్గ పోరుకు తాత్కాలికంగా ముగింపు పలికినట్లయింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 5 కారు
టాటా పంచ్
చిన్న SUV లుక్, ఎక్కువ గ్రౌండ్ క్లియరెన్స్. బడ్జెట్‌లో సేఫ్టీకి మంచి ఎంపిక.






# భువనగిరి మున్సిపాల్టి బీసీ లదే..

- చైర్మన్ గా తంగాళ్లపల్లి శ్రీవాణి
- వైస్ చైర్మన్ గా పోతంశెట్టి మంజుల

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా 35 వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ తంగాళ్ల పల్లి శ్రీవాణి రవి, వైస్ చైర్మన్ గా 29 వార్డు కాన్సిలర్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

# మాటిచ్చి మోసం చేశారు..

- కంట తడి పెట్టిన కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాటిచ్చి మోసం చేశారంటూ... కౌన్సిల్ హాలులో భువనగిరి 11వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి కంట తడి పెట్టింది. తామ గ్రామం విలీనం అయ్యాక దూరం సృష్టిస్తూ రాజకీయాలు ఏంటని మాకు అర్హత లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఓసీ, బీసీ, లోకల్ నాన్ లోకల్ వైరుధ్యాలు ఎందుకు అంటు ఎమ్మెల్యే ను నిలదీసింది. చదువుకున్న వారికి అవకాశం ఇవ్వాలని అనర్హులకు అవకాశం ఇవ్వడం కులాల పేరుతో తొక్కేస్తే ఎలా అని ప్రశ్నించింది. మొదటి నుండి చైర్ పర్సన్ పదవి ఇస్తానని మాట ఇచ్చి ఇప్పుడు 35వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన తంగెళ్ళపల్లి శ్రీవాణి ని ఎన్నుకోవడంపై గంజి శ్రీవాణి నిండు కౌన్సిల్లోనే కంటతడి పెట్టుకున్నారు. జనరల్ స్థానంలో కూడా రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి నుండి 11 వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి కే అధ్యక్ష పీఠం అని ప్రచారం జరిగిన చివరి నిమిషంలో అంచనాలు అన్ని తారుమారయ్యాయి.




# గుర్తింపును రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

అరోరా యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కార్యదర్శి లావుడియా రాజు అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలో ఉన్న అరోరా యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలని అరోరా యూనివర్సిటీ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ.. ఎన్ఐటి పేరుతో అడ్మిషన్ తీసుకొని యూనివర్సిటీ జతకట్టి అరోరా యూనివర్సిటీ అడ్మిషన్ సమయంలో ఏఐతో వీడియో చేసి వీడియోలో ఉన్నట్లుగా యూనివర్సిటీలో సదుపాయాలు ఉంటాయని నమ్మించి విద్యార్థుల నుండి 10 నుండి 11 లక్షలు పాటు ఫీజులు తీసుకున్నారని అన్నారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదని సరిపడా మౌలిక సదుపాయాలు లేక కాలయాపన చేస్తున్నారని విద్యార్థులతో యూనివర్సిటీ యజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, నాగరాజు, తీగల శ్రీనివాస్, జగన్ నాయక్, ఉదయ్, పట్టణ అధ్యక్షులు నేహాల్ పాల్గొన్నారు.




# బిజెపి కౌన్సిలర్లకు సన్మానం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీకి ఎన్నికైన బిజెపి కౌన్సిలర్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముట్కూరి అశోక్ గౌడ్ సోమవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం అధ్యక్షతన 5 వ వార్డ్ తుమ్మల యాస్మిన్ నగేష్, 16 వ వార్డ్ భోజన శారద, 19 వ వార్డ్ బండారు స్వర్ణలత, 21 వ వార్డ్ వంగేటి సుచరిత భాస్కర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో బిజెపి పార్టీ తరపున అందరూ మహిళలే ఎన్నికవ్వడం చాలా సంతోషకరమైన విషయమని పట్టణంలోని వార్డు సమస్యలపై తమ వాని వినిపిస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, సురవి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోళ్ల బిక్షపతి, ఆకుతోట రామకృష్ణ, మంగు నరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి, కొలిచేలిమ మల్లికార్జున్, ఎదగాని సంతోష్, సాయి కిరణ్, ప్రవీణ్, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల అభిప్రాయం మేరకే ఎన్నిక

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



ప్రజల అభీష్టం మేరకే మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక జరిగిందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో అదనపు కలెక్టర్ భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా 35 వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ తంగాళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ గా 29 వార్డు కాన్సిలర్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ప్రకటించిన అధికారులు వారి చే ప్రమాణ స్వీకారం చేయించారు. కౌన్సిలర్ సభ్యుల ప్రమాణ స్వీకారం తో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పట్టణ ప్రజల అభిప్రాయం మేరకే చైర్మన్ నియమించడం జరిగిందని ఎన్నికైన చైర్మన్ పదవి కాలాన్ని రెండున్నర ఏళ్లకు పరిమితం చేస్తున్నామని వెల్లడించారు.

**పట్టణంలో భారీ ర్యాలీ..**

మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణస్వీకారం అనంతరం భువనగిరి పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మొదలుకొని రాంనగర్ గాంధీనగర్ వినాయక చౌరస్తా వద్ద ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# కోదాడ పీఠం 2-3 ఫార్ములా

- మొదటి రెండేళ్లు ఎర్నేని కుసుమ కుమారి
- తర్వాతి మూడేళ్లు పారా సత్యవతిః

**ముద్ర ప్రతినిధి , కోదాడ**




కోదాడ పుర పీఠాన్ని రెండో సారి కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. మొత్తం 35 వార్డులకు 3 వార్డులు ఏకగ్రీవం కాగా ఎన్నిక జరిగిన 32 వార్డులలో 24 వార్డులు కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలుపొంది 27 వార్డులు కాంగ్రెస్ ఖాతా లోకి వెళ్ళాయి. కోదాడ మున్సిపాలిటీ రిజర్వేషన్ జనరల్ మహిళకు కేటాయించగా ఆ పదవి కోసం నలుగురు పోటీ పడ్డారు.చైర్ పర్సన్ అభ్యర్థి ఎవరనే విషయంలో నెలకొన్న సందిగ్ధానికి ఎట్టకేలకు మంత్రి ఉత్తమ్ దంపతులు తెర దింపారు. రేసులో ఉన్న నలుగురు అభ్యర్థులలో మొదటి రెండు సంవత్సరాలు ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ అవకాశం ఇవ్వగా, తర్వాతి మూడు సంవత్సరాలు మిగిలిన ఇద్దరిలో ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.

**2-3 ఫార్ములాకు మొగ్గు..**

మొదటి రెండు సంవత్సరాలు ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని, చైర్ పర్సన్ గా మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ కుమారి కి, వైస్ చైర్మన్ గా దేవరపల్లి మల్లేశ్వరి కి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకోగా, ఇక తరువాతి మూడు సంవత్సరాలు చైర్ పర్సన్ గా బీసీ సామాజిక వర్గానికి చెందిన పారా సత్యవతికి, వైస్ చైర్మన్ గా గుండపునేని పద్మావతి కి అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్డీవో సూర్యనారాయణ కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలి హోదాలో స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి హాజరయ్యారు .

## కర్ల రాజేష్ హత్య కేసులో అధికారులపై
# జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**



జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడు దళితులకు అండగా ఉంటుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల కస్టోడియల్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందా లాల్ పవార్, అడిషనల్ డీజీ చౌహన్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి కర్ల లలితమ్మకు అందజేశారు. అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమీషన్ సభ్యుడు రామ చందర్ రావు మాట్లాడుతూ..., కర్ల రాజేష్ మృతి కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటోగా తీసుకున్న అనంతరం కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతి పై నేటి వరకు చార్జ్ షీట్ ఎస్సీ అట్రాసిటీ కేసులో 60 రోజులలో వేయాలని, ఇప్పటి వరకు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఛార్జ్ షీట్ కు మరికొంత సమయం కావాలని కోరగా కమిషన్ ఛార్జ్ షీట్ వెంటనే దాఖలు చేయాలని ఆదేశించారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడంతో పాటు, ఎస్సై పై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీ ని ఆదేశించారు.

**రాజేష్ తల్లికి సాయం**

రాజేష్ తల్లికి ప్రభుత్వం నుండి పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పెన్షన్ ప్రతి నెల రూ.5 వేలు చొప్పున మంజూరయిన పెన్షన్ పత్రం అందిస్తూ, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు తో పాటు మూడు ఎకరాల భూమి ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజి డిఎస్ చౌహాన్, కలెక్టర్ తేజస్ నందా లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి పాల్గొన్నారు.

# కొలువుతీరిన పరకాల పాలకవర్గం

- చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్
- వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య
- టీఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్ల ధర్నా

**ముద్ర, పరకాల:**




పరకాల మున్సిపాలిటీ కొత్త పాలకవర్గం కొలువుదిరింది. సోమవారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో గెలుపొందిన కౌన్సిలర్లచే ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరకాల ఆర్డిఓ కే నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ 13 అత్యధిక స్థానాలను గెలుచుకొని చైర్మన్ వైస్ చైర్ పర్సన్ స్థానాలను సొంతం చేసుకునే విషయం తెలిసింది. సోమవారం జరిగిన చైర్మన్ వైస్ చైర్ పర్సన్ల ఎన్నికల సంబంధించి సమావేశం జరగా చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ వైస్ చైర్పర్సన్ గా నాలుగో వార్డ్ అభ్యర్థి ఏక దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**టీఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్ల ధర్నా**

తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఎన్నిక నిర్వహించారంటూ టీఆర్ఎస్ బీజేపీ కౌన్సిలర్లు మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. గెలుపొందిన కౌన్సిలర్లచే ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరకాల ఆర్డీవో నారాయణ ఎన్నిక ఉంటుందన్నారు. ముందుగా చైర్మ తమను బయటకు పంపి అధర్మంగా ఎన్నికల నియమాలని తుంగలో తొక్కి వైస్ చైర్మన్ ఎన్నిక జరపడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ వారు మున్సిపాలిటీ ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు.



# అధికారుల బాధ్యత ప్రశంసనీయం

- భువనగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మీరు చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో మీ సేవలు అమూల్యమైనవని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు.



# కూసుమంచిలో రోడ్డు ప్రమాదం

- తీవ్రంగా గాయపడ్డ తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య

**ముద్ర, ఖమ్మం:**

తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య సోమవారం ఉదయం కూసుమంచి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కూసుమంచిలోని గణపేశ్వర ఆలయంలో దర్శనం కోసం కుటుంబ సమేతంగా తన కారులో వెళ్తుండగా.. ఉదయం 7 గంటల సమయంలో ఒక్క సారిగా ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కారు చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బత్తుల సోమయ్య తీవ్రమైన గాయాలు అయ్యాయి. తన భార్య కు చేయి విరిగింది. సోమయ్యకు తుంటితోపాటు చెయ్యి కూడా విరిగిందని, ప్రాణాపాయ స్థితినుంచి బయటపడ్డారని డాక్టర్ రవికుమార్ గౌడ్ తెలిపారు.

**పలువురి పరామర్శ:**

తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్యకు రోడ్డు ప్రమాదం జరిగిందనే సమాచారం తెలియడంతో జిల్లా నలుమూలల నుంచి ఉద్యమకారులు భారీగా ఆస్పత్రివద్దకు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరామర్శకు వచ్చేవారితో ఆస్పత్రి ఆవరణమంతా రద్దీగా మారింది.



# అభివృద్ధికి సహకరించాలి

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూర్ మున్సిపాలిటీని తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల సామేల్, ఎంపీ చామల కుమార్ రెడ్డి ఆశీర్వాదతో మోత్కూర్ నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం పని చేస్తానని నూతన మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నరసయ్య అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. నా చైర్మన్ పదవికి సహకరించిన నాయకులకు కౌన్సిలర్లకు అందరికీ పేరు పేరున ఎల్లవేళలా రుణపడి ఉంటాను అని ఆమె అన్నారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చిన నేను ప్రజా సమస్యలు, ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పని చేస్తానన్నారు. మోత్కూర్ అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా తమకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 17.02.2026
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 6 కారు
మారుతి బ్రెజ్జా SUV సెగ్మెంట్‌లో విశ్వసనీయమైన కారు.
CNG ఆప్షన్‌తో మైలేజ్ ఇంకా ఎక్కువ.


# ఉత్కంఠకు తెర..!

- మెదక్ పీఠం హస్తగతం
- చైర్ పర్సన్ గా కానుగు రాధిక
- వైస్ చైర్మన్ గా నరేష్ గౌడ్
- హాజరైనా ఓటింగ్ కు దూరంగా బీజేపీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసు కుంది. నాలుగు రోజులు ఉత్కంఠకు తెర పడింది. ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది.

మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రిసైడింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య నిర్వహించారు. చైర్మన్ పదవికి 24 వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన కానుగు రాధిక, 3 వార్డు నుంచి బీ ఆర్ ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందిన కోటాల లలితమ్మ పేర్లను ఇరు పార్టీలు ప్రతిపదించాయి. కాంగ్రెస్ అభ్యర్థి రాధికకు ఎమ్మెల్యే రోహిత్ రావుతో పాటు 15 మంది కాంగ్రెస్ సభ్యులు చేతులు లేపారు. బీఆర్ఎస్ అభ్యర్థి లలితకు 15 మంది చేతులు లేపారు. ఒక ఓటు తేడాతో కానుగు రాధిక గెలుపొందినట్లు ప్రిసైడింగ్ అధికారి ఎల్లయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిఎస్ఓ రాజిరెడ్డి, ఆర్ఓ భవాని, టీపీఓ భూపతి పాల్గొన్నారు.

### వైస్ చైర్మన్ గా నరేష్ గౌడ్ ఏకగ్రీవం..

వైస్ చైర్మన్ అభ్యర్థిగా 15వ వార్డు నుంచి గెలుపొందిన దొంతి నరేష్ గౌడ్ ను పేరును అరుణార్తి వెంకటరమణ ప్రతిపాదించగా, తొడుపునూరి శివరామకృష్ణ బలపరిచారు. అప్పటికే బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు బయటకు వెళ్లినందున వైస్ చైర్మన్ గా దొంతి నరేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ఎల్లయ్య ప్రకటించారు.



మెదక్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మెన్ నరేష్ గౌడ్

### మూడు భాషల్లో ప్రమాణం..

మెదక్ పురపాలక సంఘంలో గెలుపొందిన 32 మంది సభ్యులతో ప్రిసైడింగ్ అధికారి ఎల్లయ్య ప్రమాణం చేయించారు. సభ్యులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్ పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ లను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అధికారులు సత్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్ బందోబస్తు కల్పించారు.

## తూప్రాన్ లో ఉద్రిక్తత

### - చైర్మన్, వైస్ చైర్మన్ పీఠం దక్కించుకున్న బీఆర్ఎస్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. 16 స్థానాల్లో 9 బీఆర్ఎస్, 4 కాంగ్రెస్, 3 బీజేపీ గెలుపొందాయి. కాంగ్రెస్ పార్టీ బీజేపీతో జతకట్టి చైర్ పర్సన్ స్థానాన్ని దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ముందుగా వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. బీఆర్ఎస్ కు చెందిన కొందరిని తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవి దక్కించుకోవడానికి ప్రయత్నం చేస్తుందన్న అనుమానం రావడంతో తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బలగాలను మోహరించారు. బీఆర్ఎస్ సభ్యులు చివరి క్షణంలో వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు. చైర్ పర్సన్ పదవికి బొంది రజని రాఘువేందర్ గౌడ్ పేరును ఆరో వార్డు కౌన్సిలర్ కొక్కొండ సమత కాశిరెడ్డి ప్రతిపాదించారు. చెలిమెల ప్రియాంక మినహా బీఆర్ఎస్ సభ్యులతో పాటు బీజేపీ సభ్యుడు మన్నె స్వామి మద్దతు ప్రకటించారు. వైస్ చైర్మన్ పదవి కొక్కొండ సమతా కాశిరెడ్డి పేరును బొడ్డు రాధాకుమారి ప్రతిపాదించారు. వైస్ చైర్మన్ కు సైతం చెలిమల ప్రియాంక మద్దతు తెలుపకపోగా, బీఆర్ఎస్ సభ్యులతో పాటు బీజేపీ సభ్యుడు మన్న స్వామి మద్దతు తెలిపారు. చైర్ పర్సన్ గా బొంది రజని రాఘువేంద్ర గౌడ్, వైస్ చైర్ పర్సన్ గా కొక్కొండ సమతా కాశిరెడ్డి ఎన్నికైనట్లుగా ప్రిసైడింగ్ అధికారి, నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ ప్రకటించారు. కమిషనర్ గణేష్ రెడ్డి, టీపీఓ పావని పాల్గొన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

## 25 ఏళ్ల తర్వాత మెదక్ పీఠం హస్తగతం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పురపాలక సంఘం పీఠాన్ని 25 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 2000లో జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్ గెలుపొందారు. తరువాత జరిగిన 3 ఎన్నికల్లో ఒకసారి టీడీపీ (ఉమ్మడి రాష్ట్రం) 2014, 2020లో టీఆర్ఎస్ గెలుపొందాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో 32 స్థానాలున్న బల్దీయాలో 14 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుపొంది పీఠం దక్కించుకోవడం విశేషం. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు చక్రం తిప్పి సక్సెస్ అయ్యారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ముద్ర, హైదరాబాద్:** సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి, రాయపోల్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సీఎం కప్ వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు పీడీ గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

పాఠశాలకు చెందిన గుంటుకు భరత్, బంటు అనిల్ జిల్లా స్థాయిలో జరిగిన క్రీడోత్సవాల్లో ప్రతిభను కనబరిచినందుకు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

# ఢిల్లీలో వైరం.. గల్లీలో స్నేహం

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీలకు వైరమున్న మెదక్ బల్దియాలో ఆ పార్టీలతో పాటు బీఎస్పీ సహకరించుకోవడం అనైతిక చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం

బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తు పోసుకుంటూ మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికల రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభపెడుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు ఏరులై పారినా అధికారులు పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ పై నమ్మకాన్ని ఉంచి కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలు ఇచ్చినందుకు కృత జ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మెదక్లో అవినీతి జరగకుండా చూసే బాధ్యత కౌన్సిలర్లపై ఉందని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెదక్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ , మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులుతోపాటు కౌన్సిలర్లు రాజవ్వ, లలిత, స్వరూప, గంగామణి, జుబెర్ అహ్మద్, అనీస్ ఫాతిమా, సంధ్య, రాజశేఖర్, మహ మ్మద్ గౌస్, శృతి, సోహెల్ మోహిద్దీన్, దీపక్, రాణి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ లో కలిసిన కాంగ్రెస్, బీజేపీ

### - చైర్మన్ గా మాచునూరి లక్ష్మి రాజు యాదవ్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నర్సాపూర్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకున్నాయి. చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ 5వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి రాజు యాదవ్ ఎన్నికయ్యారు. ఆరుగురు కాంగ్రెస్, నలుగురు బీజేపీ కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవిని దక్కించుకుంది. వైస్ చైర్మన్ పదవికి బీజేపీ 13వ వార్డు కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్ ఎన్నికయ్యారు. కాగా చైర్మన్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. తర్వాత సమావేశానికి వచ్చారు.

## రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా లావణ్య




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా గజవాడ లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, తుప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మెన్ , వైస్ చైర్మన్ ఎన్నికకు ఓటింగ్ నిర్వహించారు. కాగా పేటలో 12 మంది వార్డు సభ్యులకుగాను 8 మంది కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇతర పార్టీల సభ్యుల మద్దతు లేకుండానే గజవాడ లావణ్యను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే అదే పార్టీకి చెందిన పోచమ్మల నవనీతను వైస్ చైర్ పర్సన్ గా సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నూతన కౌన్సిలర్లు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు

## కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉమారాణి



**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గా ఇప్ప ఉమారాణి, వైస్ చైర్మన్‌గా కాసర్ల గోదావరి ఎన్నికయ్యారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికలు పూర్తి కాగా కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక ప్రక్రియను అధికారులు చేపట్టారు. కాగా 49వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఇసాక్ షేరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థి ఇప్ప ఉమారాణి పేరును ప్రతిపాదించగా 29వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ అంజాద్ బలపరిచారు.స్వతంత్ర అభ్యర్థికి కాంగ్రెస్ నుంచి 19 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు చేయి లేపి ఓటు వేశారు.

## కన్సాన్ పల్లిలో మెగా రక్త దాన శిబిరం



**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** ఆందోళ్ పరిధిలోని కన్సాన్ పల్లి గ్రామంలో సోమవారం ధీరజ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకులు నోమన్నాగారి ధీరజ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ యువకులు స్వచ్ఛందంగా రక్త దానం చేయడం అభినందనీయమన్నారు. అత్యవసర సమయాల్లో రోగుల ప్రాణాలను కాపాడటానికి రక్తదానం అత్యంత గొప్ప సేవ అన్నారు. ఇలాంటి కార్యక్రమం చేసిన ధీరజ్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు నేటి యువతకు మార్గదర్శకులుగా నిలిచారని తేలిపారు. యువత, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజలు భారీగా హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేసి మెగా రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం దాతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. రక్తదానం చేసిన ప్రతి దాతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ధీరజ్ రెడ్డి ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు చిలకంటి మాణిక్యం, బీ. కృష్ణ, సాయి కిరణ్ రెడ్డి, భరత్ యాదవ్, రమేష్ యాదవ్, అహ్మద్, ఆసిఫ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అద్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ పిఆర్ఓ డాక్టర్ అనంతరెడ్డి, లయన్స్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ఏఎంజీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాణిక్‌రెడ్డి, వెంకటేశం యాదవ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్య క్షుడు గజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు మధవరెడ్డి, శివచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

- తొమ్మిది మున్సిపాలిటీల చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక పూర్తి
- సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అధికారులు

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గ నిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆయా పార్టీల సభ్యులు సమావేశ మందిరాల్లోకి చేరుకోగా తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు, పారదర్శకంగా పూర్తయ్యింది.



సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



ఆందోల్ –జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ

### జహీరాబాద్, ఇంద్రేశం వాయిదా..

జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోల్ –జోగిపేట్, కోహీర్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, గుమ్మడిదల గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. అయితే జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో సరిపడా కోరం లేనందున ఆయా మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.

### మున్సిపాలిటీ వారీగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల వివరాలు:

ఆందోల్,– జోగిపేట్ మున్సిపల్ చైర్మన్ గా సోమ్మిరెడ్డిగారి కృష్ణారెడ్డి,(కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా ఆకుల సత్యనారాయణ (కాంగ్రెస్), గడ్డపోతారం చైర్ పర్సన్ గా శ్రీమతి గద్దె సుష్మ (బీఆర్ఎస్), వైస్ చైర్మన్ గా లక్ష్మ గోని మహేందర్ గౌడ్ (బీఆర్ఎస్), గుమ్మడిదల చైర్మన్ గా చిన్న పాపాని కుమార్ గౌడ్ (బీఆర్ఎస్), వైస్ చైర్ పర్సన్ గా చిమ్ముల సంధ్య(బీఆర్ఎస్), ఇస్నాపూర్ చైర్ పర్సన్ గా మోతే సుమలత (బీఆర్ఎస్), వైస్ చైర్ పర్సన్ గా పట్లోళ్ల మాధవి (కాంగ్రెస్), జిన్నారం చైర్మన్ గా నక్కిర్తి యాట జనార్ధన్ (బీఆర్ఎస్), వైస్ చైర్మన్ గా వంగెట్టి ప్రతాప్ రెడ్డి (బీఆర్ఎస్), కోహీర్ చైర్మన్ గా ఎం. అశోక్ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ (కాంగ్రెస్), నారాయణఖేడ్ చైర్మన్ గా నగేష్ కుమార్ షట్కార్ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా దారం శంకర్ (కాంగ్రెస్), సదాశివపేట్ మున్సిపల్ చైర్ పర్సన్ గా మునిపల్లి అంజమ్మ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా హెచ్. రేణుక (కాంగ్రెస్), సంగారెడ్డి చైర్ పర్సన్ గా కూన వనిత (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా షేక్ షఫీ అహ్మద్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు.

ఇంద్రేశం, జహీరాబాద్ మున్సిపాలిటీలలో కోరం లేకపోవడంతో ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికను పురస్కరించుకొని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దేశంలో టాప్ 7 కారు**

మహీంద్రా స్కార్పియో (N)
పవర్‌ఫుల్ ఇంజిన్, ఆఫ్ రోడ్‌కు బెస్ట్ SUV.
రఫ్ అండ్ టఫ్ డిజైన్‌తో స్ట్రాంగ్ ప్రెజెన్స్.



## స్వప్న కుమారి హత్య ఘటనపై
# నివేదిక ఇవ్వండి






- **డీజీపీకి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం**
- **పోలీసుల నిర్లక్ష్యంపై కమిషన్‌ను ఆశ్రయించిన 163 మంది న్యాయవాదులు**

**ముద్ర, హైదరాబాద్:**

న్యాయవాది జి. స్వప్న కుమారి (34) హత్య కేసులో పోలీసుల తీరుపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. చేవెళ్ల భూ వివాదంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని మృతురాలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, మొయినాబాద్ పోలీసులు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీని కమిషన్ ఆదేశించింది. ఈ నెల 4న చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాదంలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యను నివారించడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపిస్తూ 163 మంది న్యాయవాదులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తన సోదరుడి నుంచే తనకు ప్రాణహాని ఉందని స్వప్న కుమారి పోలీసులకు ముందే ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోలేదని న్యాయవాదులు ఆరోపించారు. ఇది విధి నిర్వహణలో తీవ్ర అలసత్వమని న్యాయవాదులు తమ ఫిర్యాదులో (ఎస్.ఆర్. నం. 515/2026) పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఘటనపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందజేయాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేశారు.

# శశికళ కొత్త పార్టీ...

- **తమిళనాడు రాజకీయాల్లో నూతన సమీకరణలు ఆరంభమా?**

**ముద్ర న్యూస్:**

తమిళనాడు రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ సీఎం జయలలితకు అత్యంత సన్నిహితురాలైన శశికళ (చిన్నమ్మ) మళ్లీ రాజకీయాల్లో చురుకుగా మారేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త పార్టీ స్థాపనతో తిరిగి రాజకీయ వేదికపై తన ముద్ర వేయాలని ఆమె ప్రణాళికలు రచిస్తున్నారు. జయలలిత జయంతి అయిన ఈ నెల 24న పార్టీ పేరుతో పాటు జెండాను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

**కొత్త పార్టీతో రాజకీయ రీఎంట్రీ..**

జైలు శిక్ష అనంతరం కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్న శశికళ, మళ్లీ యాక్టివ్ కావాలని నిర్ణయించుకున్నారు. అన్నాడీఎంకేలో తిరిగి చోటు సంపాదించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో ఇప్పుడు సొంత పార్టీ ద్వారా తన శక్తిని నిరూపించుకోవాలని చూస్తున్నారు. తన అనుచరులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ కనీసం 40 నియోజకవర్గాల్లో బలమైన స్థానం సంపాదించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**అన్నాడీఎంకేకు దెబ్బ పడుతుందా?**

శశికళ కొత్త పార్టీతో రావడం ప్రధానంగా అన్నాడీఎంకేకు సవాల్‌గా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో ప్రభావం ఉన్న తేవర్ సామాజిక వర్గం ఓట్లు చీలే ప్రమాదం ఉంది. ఇది ప్రత్యక్షంగా అన్నాడీఎంకే ఓటు బ్యాంక్‌ను ప్రభావితం చేసే అవకాశముంది. ఆమె పార్టీ స్వతంత్రంగా గెలవకపోయినా కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఫలితాలను మార్చే "స్పాయిలర్" పాత్ర పోషించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**దినకరన్‌తో విభేదాలు..**

శశికళ రాజకీయ ప్రయాణంలో మరో ముఖ్య అంశం ఆమె మేనల్లుడు టీటీవీ దినకరన్‌తో ఉన్న దూరం. ఆమె జైలులో ఉన్న సమయంలో దినకరన్ "అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం" అనే పార్టీని స్థాపించారు. కానీ ఇటీవల ఆయన ఎన్డీయే కూటమికి దగ్గరవడం, అన్నాడీఎంకేతో సఖ్యతకు ప్రయత్నించడం శశికళకు నచ్చలేదని తెలుస్తోంది. దీంతో ఆయనతో కలిసి పని చేయకుండా తనకంటూ ప్రత్యేక రాజకీయ వేదిక ఏర్పాటు చేసుకోవాలని ఆమె నిర్ణయించుకున్నారు.

**పొత్తులు లేదా ఒంటరి పోటీ?**

తమిళనాడులో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శశికళ పార్టీ ఏ దిశగా వెళ్తుందో ఆసక్తికరంగా మారింది. ప్రధాన పార్టీలతో పొత్తు పెట్టుకుంటారా? లేక ఒంటరిగానే పోటీ చేస్తారా? అనే అంశం కీలకం. కొన్ని అసంతృప్త నాయకులు, ముఖ్యంగా ఓ. పన్నీర్ సెల్వం వంటి నేతలు ఆమెకు మద్దతు ఇస్తే, రాజకీయ సమీకరణాలు మరింత మారే అవకాశం ఉంది.

**యువత ఓట్లు ఎటు?**

ఇప్పటికే నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం పార్టీ యువతలో ఆకర్షణగా మారుతోంది. ఈ నేపథ్యంలో యువ ఓటర్ల మద్దతు శశికళకు దక్కుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. యువతలో ప్రభావం చూపడం ఆమెకు పెద్ద సవాల్‌గా మారనుంది.

**జయలలిత వారసత్వం..**
**శశికళకు పరీక్ష**

జయలలిత జీవించిన సమయంలో శశికళ ప్రభావం ఎంతో ఎక్కువగా ఉండేది. కానీ ఆమె మరణం తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవించడం, దీర్ఘకాలం రాజకీయాలకు దూరంగా ఉండటం ఆమెకు పెద్ద మైనస్‌గా మారింది. ఇప్పుడు తిరిగి ప్రజల విశ్వాసం పొందడం, జయలలిత నిజమైన రాజకీయ వారసురాలిగా తనను నిరూపించుకోవడం ఆమెకు పెద్ద సవాల్.

**ముందు మార్గం ఎలా?**

శశికళ కొత్త పార్టీతో తమిళనాడు రాజకీయాల్లో పెద్ద మార్పులు రాకపోయినా, సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం మాత్రం ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఓట్లు చీల్చి ఫలితాలను ప్రభావితం చేసే శక్తి ఆమెకు ఉంది.

ఇప్పుడు అందరి దృష్టి ఈ నెల 24పై ఉంది. ఆ రోజు ప్రకటించే పార్టీ విధానాలు, నాయకత్వ నిర్మాణం, వ్యూహాలు.. ఇవన్నీ శశికళ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. చిన్నమ్మ రీఎంట్రీ తమిళ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందా? లేక మరో ప్రయోగంగా మిగిలిపోతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.





## ఏడుపాయలలో వైభవంగా
# బండ్ల ప్రదర్శన





- **పోటెత్తిన భక్తులు**
- **భక్తి శ్రద్ధలతో బోనాలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ లోని ఏడుపాయల జాతర వైభవంగా సాగుతోంది. వన దుర్గా ప్రాంగణం భక్తజన సంద్రమైంది. మహా జాతరలో ప్రధాన ఘట్టం రెండో రోజు ఎడ్ల బండ్ల ప్రదర్శన కన్నుల పండువగా, అత్యంత వైభవోపేతంగా సాగింది. సోమవారం ఉదయం నుంచి మహిళలు నెత్తిన బోనాలు... మరోవైపు శివసత్తుల పూనకాలు ... పోతరాజుల విన్యాసాలతో జాతర మార్మోగింది. మహా శివరాత్రి ఉపవాసాలు ఆచరించిన భక్తులు ఉదయమే అమ్మవారిని దర్శించుకుని విరమించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొద్దంతా బోనాల సందడి నెలకొంది. దప్పుల మోతలు, శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాలతో ఏడుపాయల ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడింది. సమాచార శాఖ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఘనంగా సాయంత్రం కన్నుల పండువగా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అనవాయితీ ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండి ముందు కొబ్బరికాయ కొట్టి బండ్ల ప్రదర్శన ప్రారంభించారు. పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, కొల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎడ్ల బండ్లు, గుమ్మటాల బండ్లు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నాయి. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు బందోబస్తు పర్యవేక్షించారు.

# నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయండి

- **గీతం యూనివర్శిటీకి సుప్రీం ధర్మాసనం ఆదేశం**
- **విద్యుత్ బకాయిల కేసులో కీలక తీర్పు**

**ముద్ర, న్యూఢిల్లీ:**



నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు గీతం యూనివర్సిటీని ఆదేశించింది. విద్యుత్ బకాయిల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్పందించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్సిటీ సుప్రీం కోర్టులో సవాలు చేయగా.. సోమవారం ఈ కేసుపై విచారణ చేపట్టింది. ఇందులో వీబీసీ సంస్థ, గీతం వర్సిటీ ఒకటేనని ఎస్పీడీసీ తమ వాదనలు వినిపించాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. అయితే వీబీసీ ఫెర్రో అలాయస్ కంపెనీ విద్యుత్ బకాయిలకు తమకు సంబంధం లేదని గీతం యూనివర్శిటీ సుప్రీంలో వాదించింది. వీబీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ నిర్ణయించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. అంతవరకూ నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గీతం యూనివర్శిటీకి సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. కాగా వీబీసీ సంస్థ నుంచి భూములను కొనుగోలు చేసిన గీతం యూనివర్శిటీ రూ.118 కోట్లు బకాయిలు చెల్లించాలని, లేకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ ఎస్పీడీసీ గతంలో నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను గీతం యూర్శిటీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ క్రమంలోనే రూ.54 కోట్లు చెల్లించాలని గీతం యూనివర్శిటీని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్శిటీ సుప్రీంలో సవాలు చేసింది. వీబీసీ, గీతం యూనివర్శిటీ ఒక్కటేనని ఎస్పీడీసీ వాదించింది. మరొకవైపు వీబీసీ చెల్లించాల్సిన బకాయిలు తమను చెల్లించమనడం చట్ట వ్యతిరేకమని గీతం యూనివర్శిటీ వాదించింది.



## ఆస్పత్రిని తనిఖీ చేసిన మంత్రి

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సోమవారం జోగిపేట ప్రభుత ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం వైద్యుల గదికి చేరుకున్నారు. మంత్రి వచ్చిన వార్డులు పరిశీలిస్తున్న సమయంలో వైద్యులు ఎవరు అందుబాటులో లేకపోవడం గమనార్హం. కొద్ది సేపటికి అందుబాటులో ఉన్న జూనియర్ డాక్టర్ సంతోష్ వచ్చారు. వైద్యం అందించే విధానం గురించి డాక్టర్ సంతోష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉండటంతో మంత్రి డీసీహెచ్ఎస్ పై అగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బిల్ గేట్స్‌ఏపీ సర్కార్ ఒప్పందం..

- **ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల బలోపేతం**
- **పలు అంశాలపై బిల్ గేట్స్ తో చంద్రబాబు చర్చలు**
- **ఉండవల్లి వద్ద వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన బిల్ గేట్స్**

**ముద్ర న్యూస్:**

ఏపీలో మైక్రోసాఫ్ట్ ఫౌండర్, గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం పర్యటించారు. తన ప్రతినిధి బృందంతో ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. పొగ మంచు కారణంగా విమానం ల్యాండింగ్ కు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొద్దిసేపు విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఈ ప్రత్యేక విమానం చక్కర్లు కొట్టింది. సేఫ్ గా ల్యాండ్ అయింది. గన్నవరం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్ తో పాటు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి అమరావతి వెళ్లారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తో వరుసగా భేటీలు అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు.

**కీలక ప్రాజెక్టులపై చర్చ..**



ప్రధానంగా ఏపీ సీఎం చంద్రబాబు తో జరిగిన భేటీలో బిల్ గేట్స్ కీలక ప్రాజెక్టుల గురించి చర్చించారు. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి చర్చించారు. అమరావతిలోని సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్ కేంద్రాన్ని కూడా బిల్ గేట్స్ పరిశీలించారు. అక్కడ ఆర్టీజీఎస్ విధానాలపై చంద్రబాబు గేట్స్ కు వివరించారు. మరోవైపు బిల్ గేట్స్ వెంట వచ్చిన ప్రతినిధి బృందంతో కూడా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యతో సహా ఆయా రంగాల్లో సంస్కరణలను వివరించారు. మరోవైపు బిల్ గేట్స్ తో వచ్చిన ప్రతినిధి బృందం ఉండవల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కూడా పర్యటించింది. వ్యవసాయంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీస్ బిల్ గేట్స్ పరిశీలించారు.

**సంజీవని ప్రాజెక్టుపై..**

ప్రధానంగా సంజీవని ప్రాజెక్టులో.. బిల్ గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కానుంది. ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. సంజీవని పథకాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం ఇది. ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు, ముందస్తు రోగనిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడమే దీని లక్ష్యం. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజేడ్ మెడిసిన్ వంటి అంశాలు అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు. దీనిపైనే ప్రధానంగా ఈరోజు బిల్ గేట్స్ చర్చించారు.

**నారా లోకేష్ ట్వీట్..**

మరోవైపు బిల్ గేట్స్ పర్యటన నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ సంచలన ట్వీట్ చేశారు. " మిస్టర్ బిల్ గేట్స్.. అమరావతికి స్వాగతం. గన్నవరం విమానాశ్రయంలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ను సహచర మంత్రులతో కలిసి స్వాగతించడం ఆనందంగా ఉంది. గేట్స్ ఫౌండేషన్ తో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎదురుచూస్తోంది " అంటూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దేశంలో టాప్ 8 కారు**

మహీంద్రా థార్
ఆఫ్ రోడ్ లవర్స్‌కు ఫేవరెట్ SUV.
యూత్‌కు స్టైలిష్ లైఫ్‌స్టైల్ వాహనం.



## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

**ముద్ర, తాండూర్ :**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు ప్రజల పక్షాన పోరాటం చేయాలని బిఆర్ఎస్ తాండూర్ ఇంచార్జ్ శ్రీశేల్ రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నూతన కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన నిలబడి సమస్యను పరిష్కరించేంతవరకు కలసికట్టుగా పోరాడాలని కౌన్సిలర్లకు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, నూతన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వికారాబాద్ చైర్‌పర్సన్‌గా గడ్డం అనన్య ఏకగ్రీవం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలను నిర్వహించారు. వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ గడ్డం అనన్య ఏకగ్రీవంగా ఎన్నికై పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ అర్థ సుధాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ప్రిసైడింగ్ అధికారిగా 34మంది వార్డు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశానికి ఎక్స్‌ఆఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ మార్గనిర్దేశంలో ఎన్నికల ప్రక్రియ కట్టుదిట్టంగా నిర్వహించారు. కొడంగల్ మున్సిపాలిటీలో ఎన్.ఎం. ప్రశాంత్ కుమార్ చైర్‌పర్సన్‌గా, మూడవత్ శంకర్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పరిగి మున్సిపాలిటీలో కుడుముల రజిత చైర్‌పర్సన్‌గా, హనుమంతు వైస్ చైర్మన్‌గా ఎన్నిక కాగా, తాండూరులో పట్లోళ్ల నీరజ చైర్‌పర్సన్‌గా, అబ్దుల్ రజాక్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు. ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కూకట్‌పల్లిలో వింత ఘటన

- **మృతదేహంతో మూడు రోజులు ప్రార్థనలు**
- **దుర్వాసనతో బయటపడిన విషయం**

**ముద్ర, హైదరాబాద్ :**

కూకట్‌పల్లి ప్రాంతంలో మూఢనమ్మకాన్ని తలపించే ఘటన వెలుగుచూసింది. అనారోగ్యంతో మరణించిన 45 ఏళ్ల మహిళ మళ్లీ బ్రతుకుతుందనే నమ్మకంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని మూడు రోజుల పాటు ఇంట్లోనే ఉంచి ప్రార్థనలు నిర్వహించారు. స్థానికంగా నివసిస్తున్న శైలజ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం, అంత్యక్రియలు నిర్వహించకుండా ఇంటికి తీసుకెళ్లి ఒక గదిలో ఉంచారు. ఆమె మళ్లీ ప్రాణం పొందుతుందనే ఆశతో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు సమాచారం. మూడురోజుల పాటు ఇంటి తలుపులు మూసి ఉంచడంతో పాటు ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ఈక్రమంలోనే మృతదేహం కుళ్లిపోవడంతో అపార్ట్‌మెంట్‌లో తీవ్ర దుర్వాసన వ్యాపించింది. అనుమానం వచ్చిన పొరుగువారు 'డయల్ 100'కు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మొదట తలుపులు తెరవడానికి కుటుంబ సభ్యులు నిరాకరించినప్పటికీ, పోలీసుల హెచ్చరికలతో చివరికి తలుపులు తెరిచారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయినట్లు గుర్తించిన పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## మేడ్చల్ జిల్లాలో బీఆర్ఎస్ దూకుడు

- **ఎల్లంపేట్, మూడుచింతలపల్లి బీఆర్ఎస్‌కు**
- **అలియాబాద్ కాంగ్రెస్ ఖాతాలో**

**ముద్ర ప్రతినిధి, మేడ్చల్ జిల్లా :**

మేడ్చల్ జిల్లా పరిధిలోని ఎల్లంపేట్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. అలియాబాద్ మున్సిపాలిటీ మాత్రం కాంగ్రెస్ హస్తగతమైంది. ఎల్లంపేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా లౌడియా శ్రీదేవి ఎన్నికయ్యారు. మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్‌గా జాము రవి ఎన్నికయ్యారు. ఆయా మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్‌లుగా కొల్తూర్ మోర్సుబాయి, శశిరేఖ ఎన్నికయ్యారు. అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి కంఠం శిరీష కృష్ణారెడ్డి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**ముద్ర, నారాయణ పేట :**

ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలో వి.సి. సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనుసంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని ఆమె తెలిపారు. మొదటి సంవత్సరం 4409, రెండో సంవత్సరం 3783, మొత్తం 8192 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా 144వ సెక్షన్ విధించాలని.. పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని రకాల ఏర్పాట్లు సదుపాయాలను కల్పించాలన్నారు. ఆర్టీసీ అధికారులు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సరైన బస్సులు నడపాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## ప్రజావాణిలో 24 ఫిర్యాదులు

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేర్లింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు నార్సింగ్, అమిన్పూర్, పటాన్చెరువు, మియాపూర్ శేరిలింగంపల్లి సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 24 వినతులు అధికారులకు అందాయి. ఇందులో జోనల్ కార్యాలయంలో 5, శేర్లింగంపల్లి, సర్కిల్ కార్యాలయంలో 8, నర్సింగ్ సర్కిల్ కార్యాలయంలో 3, మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో 5, అమెన్పూర్ సర్కిల్ 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

# ప్రపంచం భారత్‌కు వస్తోంది..

- **ఇండియా ఏఐ సమ్మిట్‌పై ప్రధాని మోదీ**

**ముద్ర డెస్క్ :**



దిల్లీ వేదికగా జరగుతున్న 'ఏఐఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026' కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదకగా వారికి స్వాగతం పలికారు. ప్రపంచం ఇప్పుడు ఇండియాకు వస్తోందన్నారు. ఈ మెగా ఈవెంట్‌ను ప్రారంభించడానికి ముందు ఆయన ఎక్స్ లో పోస్టు చేశారు. ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ కోసం దేశ విదేశాల నుంచి ప్రతినిధులు రావడం ఎంతో గర్వకారణమన్నారు. 'ఏఐపై చర్చకు ప్రపంచాన్ని ఒకే వేదికపై తీసుకువస్తున్నాం. దిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచ నలుమూలల వచ్చిన నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, టెక్ నిపుణులను స్వాగతిస్తున్నా. ఇది మా దేశానికి గర్వకారణం. అలాగే భారత యువత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ అభివృద్ధికి భారత్ సహకారాన్ని అందిస్తోందన డాన్ని ఈ సమ్మిట్ మరింత బలపరుస్తుంది' అని ప్రధాని మోదీ రాసుకొచ్చారు.

**పలు రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు..**

ఏఐ ఇప్పటికే పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రధాని మోదీ అన్నారు. 'ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, పరిశ్రమలు వంటి రంగాల్లో మార్పులు వచ్చాయి. ఏఐ వినియోగం బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రపంచ స్థాయిలో చర్చలకు ఈ సమ్మిట్ దోహదపడుతుంది. ఈ సమ్మిట్ ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన, అవకాశాల ఆధారిత భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని నేను విశ్వసిస్తున్నా. 1.4 బిలియన్ భారతీయుల వల్లే దేశం ఏఐ మార్పులో ముందంజలో ఉంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, ఆధునిక పరిశోధనలు ఇవన్నీ ఏఐ పట్ల భారత్‌కు ఉన్న ఆశయం, బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**భారత్ మండపం వేదికగా ఏఐ ఎక్స్‌పో..**

ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ దిల్లీలోని మండపంలో జరగనుంది. ఈ సమ్మిట్‌తో పాటు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో' కూడా జరుగుతుంది. దీనిని సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇది ఏఐ పాలసీ, ఇన్నోవేషన్, అమలు ఇలా అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా రూపకల్పన చేశారు. 70వేల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ ఎక్స్‌పో ఉంటుంది. గ్లోబల్ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల పాల్గొనున్నాయి. ఈ ఎక్స్‌పోలో ఏఐ ఎకోసిస్టంలో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని హైలైట్ చేస్తూ 13 దేశాల పెవిలియన్‌లను ఏర్పాటు చేశారు. పీపుల్‌ప్లానెట్ ప్రోగ్రెస్ అనే మూడు ప్రధాన థీమ్‌లుగా ఈ ఎక్స్‌పోను విభజించారు. 300కి పైగా ఎగ్జిబిషన్ పెవిలియన్లు, ప్రత్యక్ష డెమో ప్రదర్శనలు ఉంటాయి. వ్యవసాయం నుంచి విద్య, ఆరోగ్యం వరకు వివిధ రంగాల్లో ఏఐ ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా చూపించనున్నారు.

**స్టార్టప్‌లకు భారీ వేదిక..**

600కి పైగా హైపొటెన్షియల్ స్టార్టప్‌లు పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో చాలా వరకు వాస్తవ జీవితంలో ఉపయోగిస్తున్న AI సొల్యూషన్లు ఉన్నాయి. 2.5 లక్షలకు పైగా సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 500కు పైగా సెషన్స్, 3,250కి పైగా స్పీకర్లు , ప్యానెలిస్టులతో 500కు పైగా సెషన్లు నిర్వహించనున్నారు. ఏఐ గవర్నెన్స్ నుంచి ఇండస్ట్రీ అప్లికేషన్ల వరకు చర్చలు జరగనున్నాయి. ఏఐ ఇండియా ఇంపాక్ట్ గ్లోబల్ సౌత్‌లో జరగుతున్న తొలి అంతర్జాతీయ సమ్మిట్‌గా గుర్తింపు పొందింది. ఇక ఈ సమ్మిట్‌లో ఇండియా ఏఐ మిషన్ కింద 12 స్వదేశీ ఏఐ ఫౌండేషన్ నమూనాలను ఆవిష్కరించనున్నారు. భారత డేటాసెట్‌లపై శిక్షణ పొంది, దేశంలోని 22 అధికారిక భాషలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు.

# కొత్త పొత్తులు.. జంప్‌జిలానీలు..

- **హస్తగతమైన మున్సిపాలిటీలు**
- **షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, ఆమన్‌గల్ హస్తగతం**
- **ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

జిల్లాలో ఓటర్ల తీర్పుకు భిన్నంగా మున్సిపాలిటీల్లో అధికారం మారింది. ఆరు మున్సిపాలిటీల్లో ఐదు చోట్ల కాంగ్రెస్ ఆధిపత్యం చాటుకుంది. షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, ఆమనగల్ మున్సిపాలిటీల్లో కొత్త పొత్తులు, జంపింగ్‌ల మధ్య కాంగ్రెస్ చైర్మన్ పీఠాలను దక్కించుకుంది. కొన్ని చోట్ల ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో ఫలితాలు తారుమారయ్యాయి.

**బీఆర్ఎస్‌లో కుర్చీ కొట్లాట..**

**ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నిక వాయిదా..**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య విభేదాలు తలెత్తడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. సమావేశానికి ఒక కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చెలరేగడంతో ఎన్నికల అధికారి సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. ఇక్కడి ఫలితం ఉత్కంఠ రేపుతోంది.

**చైర్మన్ పీఠంకై...కొత్త పొత్తులు.. జంపింగ్‌లు..**

మున్సిపాలిటీల్లో అధికారాన్ని సాధించేందుకు ప్రధాన పార్టీల మధ్య అనధికార పొత్తులు కుదిరాయి. కొందరు కౌన్సిలర్లు పార్టీ మారడంతో స్థానిక రాజకీయాల్లో సంచలనం నెలకొంది. ఎక్స్‌ఆఫీషియో సభ్యుల మద్దతు కూడా కీలకంగా మారింది.

**షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా అగనూరు బస్వం**

28 వార్డుల్లో మెజార్టీ సాధించిన కాంగ్రెస్ తరఫున అగనూరు బస్వం చైర్మన్‌గా, అందే మోహన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**చేవెళ్ల మున్సిపల్ చైర్మన్‌గా దేవర సమతా వెంకట్‌రెడ్డి**

18 వార్డుల్లో 11 గెలిచిన కాంగ్రెస్ తరఫున దేవర సమతా వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా, రాములు గౌడ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా సాత ప్రవీణ్**

15 వార్డుల్లో 9 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ నుంచి సాత ప్రవీణ్ చైర్మన్‌గా, శ్వేత పాండురంగారెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా దుబ్బ సోనియా**

హంగ్ పరిస్థితుల్లో ఇతర కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. దుబ్బ సోనియా చైర్మన్‌గా, గుడుగు రాజు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**ఆమనగల్ మున్సిపల్ చైర్మన్‌గా పత్యా నాయక్**

బీఆర్ఎస్, బీజేపీ మెజార్టీ ఉన్నప్పటికీ రాజకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ మద్దతుతో పత్యా నాయక్ చైర్మన్‌గా, తల్లోజు గీత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.



షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్



మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా దుబ్బ సోనియ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా గరుగు రాజు(స్వతంత్ర) ఎన్నిక.



చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన దేవర సమత ఎన్నిక, వైస్ చైర్మన్ గా రాములు గౌడ్.



అమన గల్ మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్



అమన గల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తల్లోజు గీత



శంకర్ పల్లి చైర్మన్ గా సాత ప్రవీణ్ కుమార్



వైస్ చైర్మన్ గా జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి

దేశంలో టాప్ 9 కారు
టయోటా ఇన్నోవా
హైక్రాస్
ఫ్యామిలీ ట్రావెల్‌కు
కంఫర్ట్, స్పేస్ ఎక్కువ.
హైబ్రిడ్ టెక్నాలజీతో
మంచి మైలేజ్.





## ఇండియా–పాక్ మ్యాచ్‌కు రికార్డు వ్యూస్..

**ఉబ్బితబ్బిబవుతున్న జియో హాట్‌స్టార్**

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026లో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన హై వోల్టేజ్ పోరు డిజిటల్ స్ట్రీమింగ్‌లో కొత్త రికార్డులు సృష్టించింది. ఈ మ్యాచ్‌కు మొత్తం 45.4 కోట్ల వ్యూస్ వచ్చినట్లు జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. ఒకేసారి ప్రత్యక్షంగా వీక్షించిన వారి సంఖ్య కూడా సుమారు 6 కోట్ల వరకు చేరి క్రికెట్ చరిత్రలోనే అత్యధికంగా నమోదైంది. ఇంతకుముందు ఈ రికార్డు ఐసీసీ క్రికెట్ ప్రపంచకప్2023 ఫైనల్ పేరిట ఉండేది. ఆ మ్యాచ్‌ను సుమారు 5.9 కోట్ల మంది ఒకేసారి చూశారు. తాజా ఇండియా-పాక్ పోరు ఆ మార్కును అధిగమించడం విశేషం. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల విస్తరణతో ప్రత్యక్ష మ్యాచ్‌లకు భారీగా ప్రేక్షకులు చేరుతున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది.కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 176 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చి పాకిస్థాన్‌ను 114 పరుగులకే కట్టడి చేసింది. 61 పరుగుల తేడాతో గెలిచి సూపర్8 దశకు చేరుకోగా పాకిస్థాన్ నెట్‌రన్‌రేట్ దెబ్బతింది. మ్యాచ్‌కు ముందు వచ్చిన బహిష్కరణ హడావుడి, ఉత్కంఠభరిత వాతావరణం కారణంగా ప్రేక్షకుల ఆసక్తి మరింత పెరిగి జియో హాట్‌స్టార్‌కు అరుదైన వ్యూయర్‌షిప్ రికార్డు దక్కింది

## పాక్ ఓటమితో మారిన సూపర్8 సమీకరణాలు



ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026లో భారత్ మరోసారి పాకిస్తాన్‌పై తన ఆధిపత్యాన్ని చాటింది. కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో సల్మాన్ ఆఘా సారథ్యంలో బరిలో దిగిన పాక్ జట్టును 61 పరుగుల తేడాతో ఓడించింది. ఈ విజయంతో భారత జాతీయ క్రికెట్ జట్టు వరుసగా మూడో గెలుపును నమోదు చేసి గ్రూప్ఎ నుంచి సూపర్8కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఇక చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ నెదర్లాండ్స్‌తో తలపడనుంది.గ్రూప్‌లో రెండో స్థానానికి పోటీ మాత్రం ఆసక్తికరంగా మారింది. అమెరికా జాతీయ క్రికెట్ జట్టు నాలుగు మ్యాచ్‌లలో రెండు విజయాలు సాధించి నాలుగు పాయింట్లతో పాటు మెరుగైన నెట్‌రన్‌రేట్‌ను సొంతం చేసుకుంది. భారత్, పాకిస్తాన్ చేతిలో ఓడినా నెదర్లాండ్స్, నమీబియాలపై సాధించిన విజయాలు వారికి కీలకంగా మారాయి. ముఖ్యంగా భారత్ చేతిలో పాకిస్తాన్ భారీ తేడాతో ఓడిపోవడం అమెరికా అవకాశాలను మరింత బలపరిచింది.ఇప్పుడు పాకిస్తాన్ జాతీయ క్రికెట్ జట్టు పరిస్థితి కఠినంగా మారింది. సూపర్8కు చేరాలంటే నమీబియాతో మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి. గెలిస్తే ఆరు పాయింట్లతో అమెరికాను దాటి ముందుకు వెళ్తుంది. ఓడిపోతే నాలుగు పాయింట్ల వద్దే నిలిచిపోతుంది. ఆ సందర్భంలో నెట్‌రన్‌రేట్ ఆధారంగా అమెరికాకే ప్రయోజనం ఉంటుంది.ఈ టోర్నీలో చిన్న జట్లు పెద్దవారిని సవాల్ చేస్తున్నాయి. అమెరికా భారత్‌కు గట్టి పోటీ ఇవ్వగా, జింబాబ్వే ఆస్ట్రేలియాను షాక్‌కు గురిచేసింది. నేపాల్ ఇంగ్లండ్‌ను ఒత్తిడిలోకి నెట్టగా, ఇటలీ కూడా తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అందువల్ల నమీబియాతో మ్యాచ్‌లో పాక్ నిర్లక్ష్యం చేస్తే లీగ్ దశలోనే నిష్క్రమించే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు సూపర్8కు భారత్‌తో పాటు వెస్టిండీస్ మాత్రమే అధికారికంగా అర్హత సాధించాయి. మిగిలిన స్థానాల కోసం పోటీ మరింత ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది.




## అఫ్గానిస్థాన్‌కు ఊరటనిచ్చిన తొలి విజయం

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు చివరకు విజయఖాతా తెరిచింది. మూడో మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ క్రికెట్ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో గెలిచి టోర్నీలో ఊపిరి పీల్చుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. మధ్య ఓవర్లలో వేగంగా పరుగులు చేసినా, చివర్లో అఫ్గాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పెద్ద స్కోరు దాటలేకపోయింది. 161 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించిన అఫ్గానిస్థాన్ మొదట జాగ్రత్తగా ఆడింది. అనంతరం ఇబ్రహీం జద్రాన్ అర్ధశతకంతో ఇన్నింగ్స్‌ను స్థిరపరిచాడు. అతడు 53 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (40 నాటౌట్), డార్విష్ రసూలి (33) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను అఫ్గాన్ వైపు తిప్పారు. దీంతో అఫ్గాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. యూఏఈ బౌలర్లలో జునైద్, ఆర్ఫాన్ తలా రెండు వికెట్లు తీసుకోగా జవాదుల్లా ఒక వికెట్ సాధించాడు. అయితే అఫ్గాన్ బ్యాటర్ల ధాటికి వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఈ గెలుపుతో అఫ్గానిస్థాన్ టోర్నీలో తన అవకాశాలను కొనసాగించుకుంది.



## ధోనీ రికార్డును సమం చేసిన సూర్యకుమార్

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026లో పాకిస్థాన్‌పై భారత్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ భారత జట్టుకు మాత్రమే కాకుండా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్కు ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. పాకిస్థాన్‌పై కెప్టెన్‌గా వరుసగా నాలుగు విజయాలు నమోదు చేస్తూ ఆయన ఎంఎస్ ధోనీ సాధించిన రికార్డును సమం చేశాడు.

**సమిష్టి ప్రదర్శనతో ఆధిపత్యం**

టాస్ ఓడి ఎందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది. అనంతరం బౌలింగ్‌లో కట్టుదిట్టంగా పంజా విసిరిన భారత జట్టు ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వలేదు. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ అద్భుతంగా బౌలింగ్ చేసి పాకిస్థాన్‌ను కేవలం 114 పరుగులకే పరిమితం చేశారు. ఫలితంగా భారత్‌కు సునాయాస విజయం దక్కింది. ఈ గెలుపుతో భారత్ అధికారికంగా సూపర్8 దశలోకి అడుగుపెట్టింది.

**పాక్‌కు చివరి అవకాశం**

ఇక పాకిస్థాన్‌కు టోర్నీలో నిలబడాలంటే తదుపరి మ్యాచ్ కీలకంగా మారింది. నమీబియాపై తప్పక గెలిస్తేనే తదుపరి దశకు చేరే అవకాశాలు ఉంటాయి. ఒకవేళ ఓటమి చవిచూస్తే లీగ్ దశలోనే నిష్క్రమించే పరిస్థితి తలెత్తుతుంది. భారత్ ఇప్పటికే ముందడుగు వేసిన నేపథ్యంలో, పాక్ భవిష్యత్తు ఇప్పుడు ఆఖరి మ్యాచ్ ఫలితంపైనే ఆధారపడి ఉంది.

## "శర్మా...నీకు బుద్ధుందా?"

- **పాక్ మాజీ కెప్టెన్ ను హగ్ చేసుకోవడంపై నెట్టింట విమర్శలు**

రోహిత్ శర్మ నెట్టింట విమర్శల పాలయ్యాడు. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026 ప్రచారకర్తగా ఉన్న ఆయన, కొలంబోలో జరిగిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. మ్యాచ్‌కు ముందు ట్రోఫీని మైదానంలోకి తీసుకువచ్చిన సందర్భంగా పాకిస్థాన్ దిగ్గజం వసీం అక్రమ్‌తో కరచాలనం చేసి ఆలింగనం చేసుకున్నాడు. ఈ దృశ్యాలు వైరల్ కావడంతో ఇరు దేశాల అభిమానుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది.ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జట్టు ఆటగాళ్లు పాక్ ప్లేయర్లతో హ్యాండ్‌షేక్ చేయకుండా ఉంటున్న సందర్భంలో ఈ సంఘటన చర్చకు దారితీసింది. మ్యాచ్ అనంతరం కూడా ఇరు జట్ల ఆటగాళ్లు పరస్పరం అభివాదాలు చేసుకోలేదు. అలాంటి సమయంలో రోహిత్ అక్రమ్‌ను హగ్ చేయడం సరైంది కాదని కొందరు విమర్శిస్తున్నారు. పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు అహ్మద్ షెహజాద్, మహమ్మద్ అమీర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. జట్టు ఓటమి నేపథ్యంలో ఇలాంటి దృశ్యాలు అభిమానులను మరింత బాధపెడతాయని వ్యాఖ్యానించారు. అయితే మరోవైపు రోహిత్ అభిమానులు మాత్రం అతను క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాడని, పెద్దలను గౌరవించడం తప్పేమీ కాదని సమర్థిస్తున్నారు.






## ఇటలీపై ఇంగ్లండ్ విజయం..

- **సూపర్-8లోకి ఎంట్రీ**

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్2026లో భాగంగా జరిగిన గ్రూప్‌సీ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జాతీయ క్రికెట్ జట్టు 24 పరుగుల తేడాతో ఇటలీ జాతీయ క్రికెట్ జట్టుపై విజయం సాధించింది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సూపర్8 దశకు అర్హత సాధించింది.మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ నిర్ణీత ఓవర్లలో 202 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ అత్యంత వేగంగా ఆడుతూ కేవలం 22 బంతుల్లోనే 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఫిల్ సాల్ట్ 28, జాకబ్ బేతెల్ 23, టామ్ బాంటన్ 30 పరుగులతో కీలక సహకారం అందించారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా తర్వాత బెన్ మానెంటి ధాటిగా ఆడి పోరాటం చూపించాడు. 25 బంతుల్లో 60 పరుగులు చేసి కొంతసేపు మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చాడు. జస్టిన్ మోస్కా 34 బంతుల్లో 43, గ్రాంట్ స్టీవార్ట్ 23 బంతుల్లో 45 పరుగులు చేయడంతో ఇటలీ పోటీ ఇచ్చింది. అయితే చివర్లో వరుసగా వికెట్లు కోల్పోవడంతో 178 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి పాలైంది. దాంతో 24 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లండ్ తదుపరి దశకు దూసుకె

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## ఫిబ్రవరి 26న విజయ్–రష్మిక పెళ్లి?

- **వైరల్ అవుతున్న కార్డు**

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఈ నెల 26న వివాహం చేసుకోనున్నారనే ప్రచారం నెట్టింట జోరుగా సాగుతోంది. వీరిద్దరి పేర్లతో ఉన్న వెడ్డింగ్ కార్డు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ఫిబ్రవరి 26న పెళ్లి, మార్చి 4న బంజారాహిల్స్‌లో రిసెప్షన్ అని పేర్కొన్నట్లు కనిపిస్తోంది. అయితే అధికారిక ప్రకటన లేదు. ఇద్దరూ కలిసి నటించిన గీత గోవిందం, డియర్ కామ్రేడ్ తర్వాత ప్రేమ వార్తలు వినిపించాయి. ప్రస్తుతం రణబాలిలో మరోసారి జంటగా కనిపించనున్నారు.

## సుహాస్ సినిమాకు సెన్సార్ షాక్..

- **టైటిల్ మార్పు**



సుహాస్, శివానీ నాగారం జంటగా నటించిన చిత్రం మొదట 'హే భగవాన్' పేరుతో ప్రకటించారు. అయితే సెన్సార్ సూచనలతో టైటిల్‌ను 'హే బల్‌వంత్'గా మార్చారు. గోపీ అచ్చర తెరకెక్కించిన ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదలకు సిద్ధమవుతోంది. పేరు మారినా వినోదం తగ్గదని చిత్రబృందం తెలిపింది.ప్రచారంలో భాగంగా నిర్మాత వంశీ కాంటెస్ట్ ప్రకటించారు. హీరో తండ్రి పాత్రలో నరేశ్ చేసే వ్యాపారం ఏంటో అంచనా వేసిన ఐదుగురికి రూ.20 వేల చొప్పున బహుమతి ఇస్తామని వెల్లడించారు. ట్రైలర్‌లలో ఆ అంశాన్ని రహస్యంగా ఉంచారు. విడుదలకు ముందు టైటిల్ మార్పుపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కపుల్ ఫ్రెండ్లీ చిత్రానికీ ఇలాంటి పరిణామం చోటుచేసుకుంది. సెన్సార్ నిర్ణయాలు సినిమాలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



## సారీ త్రిష...

**సౌత్ బ్యూటీకి బీజేపీ నేత క్షమాపణలు**

హీరోయిన్ త్రిష కృష్ణన్ గురించి చేసిన వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత నైనర్ నాగేంద్రన్ క్షమాపణలు తెలిపారు. తన మాటలు అనవసర వివాదానికి దారితీసినట్టు భావించి వాటిని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ ఘటన సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు. ఈ విషయంపై త్రిష తరఫున న్యాయవాది నిత్యేష్ నటరాజ్ ప్రకటన విడుదల చేశారు. ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర నిరాశ కలిగించాయని తెలిపారు. త్రిష ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేరని, భవిష్యత్తులో కూడా రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ చర్చల్లోకి లాగడం సరైంది కాదని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు.

ఇటీవల నటుడు విజయ్ పై విమర్శలు చేస్తూ నాగేంద్రన్ త్రిష పేరును ప్రస్తావించారు. విజయ్ రాజకీయాల్లోకి రావాలంటే త్రిషతో ఉన్న బంధం నుంచి బయటపడాలని చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలను అధికార డీఎంకే నేతలు, అలాగే విజయ్ పార్టీ వర్గాలు తీవ్రంగా ఖండించడంతో చివరికి నాగేంద్రన్ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

## రెబల్ స్టార్‌ను వెంటాడుతున్న గాయాలు



ప్రముఖ హీరో ప్రభాస్ షూటింగ్ సమయంలో గాయపడ్డారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ చిత్రంలోని ఒక యాక్షన్ సన్నివేశం కోసం గుర్రపు స్వారీ చేస్తుండగా ఆయన కింద పడినట్లు సమాచారం. చేతికి స్వల్ప గాయం అయినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడిగా ఇమాన్వీ నటిస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా మూవీలో ప్రభాస్ కొత్త లుక్‌లో కనిపించనున్నారని టాక్. అలాగే మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రీకరణను త్వరగా పూర్తి చేసి దసరా సందర్భంగా తెలుగు సహా పలు భారతీయ భాషల్లో విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# టాలీవుడ్‌కు తెలుగు అందాల జోష్



తెలుగు సినిమాల్లో స్థానిక అమ్మాయిలకు అవకాశాలు తక్కువనే మాట చాలా కాలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు అనుష్క శెట్టి, కాజల్ అగర్వాల్, తమన్నా భాటియా, సమంత రూత్ ప్రభు లాంటి స్టార్ హీరోయిన్లు ఇండస్ట్రీని డామినేట్ చేసిన కాలం ఉంది. ఇప్పుడు మాత్రం అటువంటి స్పష్టమైన నంబర్ వన్ స్థానం ఎవరికీ లేదు. ఈ ఖాళీ సమయంలోనే తెలుగమ్మాయిలు ముందుకు వస్తూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.వైష్ణవి చైతన్య బేబీతో మంచి గుర్తింపు తెచ్చుకుని వరుస ప్రాజెక్టులతో బిజీ అయింది. శివాని నాగారం అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు ద్వారా పరిచయం అయి లిటిల్ హార్ట్స్ తో విజయాన్ని అందుకుంది. అలాగే ఫరియా అబ్దుల్లా జాతిరత్నాలు తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ కొనసాగుతోంది.ఇక శ్రీ గౌరీ ప్రియ తమిళంలో అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు వెళ్తోంది. మానస వారణాసి కపుల్ ఫ్రెండ్లీతో మంచి గుర్తింపు తెచ్చుకోగా, 'కోర్టు' ద్వారా పరిచయమైన శ్రీదేవి కూడా కొత్త చిత్రాలతో బిజీ అవుతోంది. ఇదే సమయంలో చాందిని చౌదరి, ఈషా రెబ్బా, అనన్య నాగళ్ళ లాంటి వారు ఇప్పటికే తమకంటూ స్థానం సంపాదించుకున్నారు. మొత్తంగా చూస్తే హీరోయిన్ల కొరత ఉన్న ఈ దశలో తెలుగు అమ్మాయిలు ముందుకు రావడం టాలీవుడ్‌కు కొత్త ఉత్సాహాన్ని తెస్తోంది. సరైన కథలు, మంచి అవకాశాలు లభిస్తే ఈ తరానికి చెందిన హీరోయిన్లు త్వరలోనే స్టార్ రేంజ్‌కు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అందాల 'నిధి'



హీరోయిన్ నిధి అగర్వాల్ 2017లో బాలీవుడ్ చిత్రం మున్నా మైఖేల్ తో సినీ ప్రయాణం ప్రారంభించి తరువాత తెలుగు, తమిళ చిత్రాలపై దృష్టి పెట్టింది. ఇస్మార్ట్ శంకర్ ద్వారా మంచి గుర్తింపు పొందినా, ఇటీవల వచ్చిన హర హర వీర మల్లూ, రాజా సాబ్ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త సినిమాల ప్రకటనలు లేకపోవడంతో అభిమానులు బలమైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా చేసిన ఫొటోషూట్ తో నిధి మరోసారి ఆకట్టుకుంది. లైలాక్ రంగు భారీ లెహంగాలో 3D ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ, సిల్వర్ సీక్విన్ డిజైన్‌లు మెరిసే లుక్ ఇచ్చాయి. బటర్‌ఫ్లై స్టైల్ క్రాప్‌టాప్ ఆధునిక టచ్‌ను తీసుకొచ్చింది. వాల్యూమ్ వేవ్స్ హెయిర్‌స్టైల్, సాఫ్ట్ మేకప్, ఫ్లోరల్ ఇయర్‌రింగ్స్‌తో ఆమె గ్లామర్‌కు క్లాసీ ఫినిషింగ్ వచ్చింది

## బ్లూ సారీలో డింపుల్ హయాతి మెరుపులు



విజయవాడకు చెందిన గ్లామర్ హీరోయిన్ డింపుల్ హయాతి మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంది. బ్లూ ఎంబ్రాయిడరీ చీరలో ట్రెడిషనల్‌మోడర్న్ మిక్స్‌గా కనిపించిన ఆమె, స్లీవ్‌లెస్ లోనెక్ బ్లౌజ్‌తో బోల్డ్ టచ్ ఇచ్చింది. సిల్వర్‌బ్లూ చోకర్, మ్యాచింగ్ ఇయర్‌రింగ్స్, ఫింగర్ రింగ్స్ లుక్‌కు ఎలిగెన్స్ జోడించగా, హై బన్ హెయిర్‌స్టైల్ మరియు సాఫ్ట్ గ్లోయింగ్ మేకప్‌తో క్లాసీగా మెరిసింది. చివరిసారిగా ఆమె భారత మహాసయులకు వినతి చిత్రంలో రవి తేజా సరసన కనిపించింది. సినిమా ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ఆమెపై చిత్రీకరించిన గ్లామర్ పాటలు సోషల్ మీడియాలో మంచి స్పందన పొందాయి. తన ఫ్యాషన్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో డింపుల్ ఇంకా అభిమానులను ఆకట్టుకుంటూనే ఉంది.

## పీఆర్ కల్చర్‌పై శోభిత ఘాటు వ్యాఖ్యలు



బాలీవుడ్‌లో పీఆర్ వ్యవస్థ అధికమైందనే విమర్శలు ఇటీవల తరచూ వినిపిస్తున్నాయి. ఈ చర్చల మధ్య నటి శోభిత ధూళిపాళ్ల కూడా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తనకు పీఆర్ ప్రచారం అవసరం లేదని, అలాంటి విధానం ప్రతి ఒక్కరికీ సరిపోదని ఆమె స్పష్టం చేశారు.తాజాగా వచ్చిన చీకటిలో గురించి మాట్లాడుతూ, కథ వినగానే వెంటనే ఒప్పుకున్నానని తెలిపారు. షూటింగ్ ప్రారంభమైన తర్వాత పాత్రతో మరింత అనుబంధం ఏర్పడిందన్నారు. సినిమాలో ఉన్న కఠినమైన డైలాగులు చెప్పడంలో తెలుగు మాతృభాష కావడం వల్ల సులభంగా అనిపించిందని, డబ్బింగ్ సమయంలో ప్రతి సన్నివేశాన్ని ఆస్వాదించానని చెప్పారు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. పీఆర్ సంస్కృతి గురించి ఆమె మరింత స్పష్టంగా స్పందించారు. సినీ నేపథ్యం లేకుండా విశాఖపట్నం నుంచి వచ్చి ఒక్కో మెట్టు ఎక్కానని తెలిపారు. ఎప్పుడూ వార్తల్లో ఉండాలి, అందరూ మాట్లాడుకోవాలి అన్న ఆలోచన తనకు లేదని, పీఆర్ వ్యవస్థ కొందరికి ఉపయోగపడినా తనకు మాత్రం అవసరం లేదని పేర్కొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com